# జలపాఠాలు

రెండు బొమ్మలు వేసానిక్కడ. ఒకటి కృష్ణానది, రెండోది గోదావరి. మన రాష్ట్రంలో తగాదాలు ఎక్కువ ఉండేది ఈ రెండు నదుల మీదే. అవి రెండూ కూడా మీ ప్రాంతానికి సంబంధించినవి కావు. పోలవరం నీళ్ళు మీకు వస్తాయని మీరు ఆశిస్తున్నారు. అవి రావద్దని మేము అనుకుంటున్నాము. డ్యామే రావద్దని అంటున్నాం, మీకు రావద్దని కాదు. అదట్లా ఉంచి మీ జిల్లాకు దాదాపుగా ఏ సంబంధం లేనటువంటి ఈ విషయాల మీద అవగాహన కావాలని విశాఖపట్నం జిల్లా కమిటీ కోరుకోవడాన్ని నేను అభినందిస్తున్నా. ఎందుకంటే మనకు సంబంధించినవి మాత్రమే హక్కులు అనుకోకుండా ఈ రాష్ట్రంలో బ్రతుకుతున్నాం కాబట్టి, ఈ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి సంబంధించినది అయినా మన సమస్యే అనుకోవడం మంచి లక్షణం.



బాబ్లీ బాబ్లీ అని వింటున్నాం ప్రతిరోజూ మీడియాలో. ఏమిటీ బాబ్లీ? టీడీపీ చెప్పింది కరెక్టా, టీఆర్ఎస్ కరెక్టా, కాంగ్రెస్ కరెక్టా? లేక అందరిదీ తప్పా. తెలియాలి కదా! అలాగే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి జరుగుతున్న వివాదం. పులిచింతల గురించి, పోలవరం గురించి, బాబ్లీ గురించి– అన్నిటి మీద భిన్నాభిప్రాయాలుంటాయి. ఉండటం సహజం కూడా. కాని మేము కొంతకాలం నుంచి నీటికి సంబంధించి ఒక అవగాహనతో మాట్లాడుతూ వచ్చాం. నీరనేది ప్రకృతి సిద్ధంగా వచ్చేది. ఒకరు కల్పించేది కాదు, ఒకరు తయారు చేసేది కాదు. గాలి, నేల లాంటిదే నీరు కూడా. అది అందరికీ వాళ్ళ వాళ్ళ అవసరాన్ని బట్టి సమానంగా అందుబాటులో ఉండాలి. అది తప్ప వేరే ఏ ప్రమాణాలు ఉండటానికి వీలు లేదు. నేను తయారు చేస్తే నాకుంటుంది అనొచ్చు

ఎవరైనా. నేను కనిపెట్టింది నాకుండాల అని కూడా అంటుంటారు అప్పుడప్పుడు. నేను మొట్టమొదట చూసింది నాకే చెందుతుంది అని తెల్లవాడు అన్నాడు. ప్రపంచాన్నంతా తాము చూసినప్పుడే పుట్టిందనుకున్నారు వాళ్ళు. నీళ్ళు ఒకడు మొట్టమొదట చూసిందీ కాదు, ఒకడు కనిపెట్టిందీ కాదు, ఒకడు తయారు చేసిందీ కాదు. ప్రకృతి ఇచ్చిందని లేదా దేవుడిని నమ్మితే దేవుడిచ్చాడని అనుకుంటాం మనం. కాబట్టి వాళ్ళ వాళ్ళ అవసరాన్ని బట్టి మాత్రమే నీటి మీద హక్కులు ఉండాలి. ఆచరణలో అనేక రకాల సమస్యలుంటాయి. అయినప్పటికీ ఈ సూత్రం లేక విలువ ప్రాతిపదికగానే నీటి పంపకం జరగాలన్న అవగాహనతోనే మొదటి నుంచీ మేము ఈ సమస్యపై స్పందిస్తున్నాం.

## నాలుగు ముఖ్య వివాదాలు

కృష్ణా, గోదావరి మన రాష్ట్రంలోని పెద్దనదులు. ఈ రెండు నదుల నీటి మీదే ఇప్పుడు చాలా వివాదం ఉంది. వివాదం ఉండేవాటిలో ముఖ్యమైనవి–

1. పులిచింతల
2. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. ఇది శ్రీశైలం కుడికాలువ కుండే రెగ్యులేటర్.
3. బాబ్లీ. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్రలో ఉంటుంది ఇది.
4. పోలవరం.

## చట్టం కన్నా ముందే హక్కులు

నదీజలాల మీద హక్కులు అనేవి ఒక చట్టమంటూ ఏదీ లేని రోజులలోనే పుట్టడం మొదలైంది. బ్రిటిష్ వాళ్ళు పరిపాలిస్తున్న రోజులలో వాళ్ళ పాలనావసరాల కోసం కొన్ని ఆనకట్టలు కట్టారు. ఇప్పుడున్నంత పెద్ద డ్యాములు కావవి. వాళ్ళే మొదట కొన్ని హక్కులు కూడా కల్పించారు. ఇవ్వాళ ప్రకాశం బ్యారేజీ అంటున్నామే– అప్పుడు దాని పేరు అది కాదు. కృష్ణా డెల్టా వర్క్స్ అనేవారు – అక్కడొక ఆనకట్ట కట్టారు. దాని నుంచి కృష్ణా డెల్టాకు నీళ్ళిచ్చారు. అయితే వాళ్ళు ఆనకట్టలు కట్టింది వరదల్ని ఆపడానికి, జల రవాణాకు. అప్పట్లో రైళ్ళు, బస్సులు ఎక్కువ లేవు కాబట్టి సరుకుల రవాణాకు ఎక్కువగా పడవలను ఉపయోగించే వాళ్ళు. వరదల నియంత్రణ కూడా దాంట్లో భాగంగానే జరిగింది. ఒకసారి డ్యామంటూ కట్టిన తర్వాత నీళ్ళు ఉంటాయి కాబట్టి పంటలకు కూడా ఇచ్చారు. దానివల్ల పంటలు పండాయి. రైతులకు ఆదాయాలు పెరిగాయి. ఆ ప్రాంతం సంపన్నమైన ప్రాంతం అయింది. ప్రభుత్వాల రెవెన్యూ

కూడా పెరిగింది. అది కూడా ప్రభుత్వానికి మేలు చేసింది. అట్లా వాళ్ళు కృష్ణానది మీద ఒక బ్యారేజీ, గోదావరి మీద ధవళేశ్వరం దగ్గర ఒక బ్యారేజీ కట్టారు. దాదాపు అదే సమయంలో కావేరి మీద కూడా ఒక బ్యారేజీ కట్టారు. ఇది 19వ శతాబ్దం మధ్య భాగంలో జరిగింది. అప్పట్లో నువ్వు ఇక్కడ బ్యారేజీ కట్టి క్రింది వాళ్ళకు నీళ్ళిస్తున్నావు, వాళ్ళకు నీటిమీద హక్కులు కల్పిస్తున్నావు, మరి మా సంగతేమిటి అని అడిగే అవకాశం పై వాళ్ళకు లేదు. అడగటానికి ఒక చట్టమూ లేదు. అడగాలన్న ఆలోచన కూడా బహుశా ఆ రోజులలో లేదు. అలా ఏ చట్టమూ లేని రోజులలోనే కృష్ణాడెల్టాకు, గోదావరి డెల్టాకు హక్కులు పుట్టేసాయి. దాని వల్ల ఆ ప్రాంతాలు ఆ తర్వాత సంపన్నమైనాయి. అంతకు ముందు అవేమీ సంపన్న ప్రాంతాలు కావు. నిజానికి నివాసయోగ్యాలు కూడా కాని ప్రాంతాలే ఎక్కువ ఉండేవి. ఆ నీళ్ళు వచ్చిన తర్వాతనే అవి క్రమంగా బాగుపడ్డాయనేది వాస్తవం.

బ్రిటిష్ వాళ్ళు చేసినటువంటి చట్టాలలో ఎక్కడా కూడా ఒక నది నీటిపై ఎవరికెంత హక్కు ఉంటుందనేది లేదు. వాళ్ళ పాలనా ప్రాంతంలోనే మద్రాసు రాష్ట్రం ఉండేది, బొంబాయి రాష్ట్రం ఉండేది, బెంగాల్ ఉండేది, ఒరిస్సా ఉండేది. అయినా వీళ్ళ హక్కులెట్లా, వాళ్ళ హక్కులెట్లా అని విభజించే చట్టమేదీ బ్రిటిషువాళ్ళు చెయ్యలేదు. వాళ్ళు తమ పాలనా సౌలభ్యం ప్రకారం మాత్రమే చేసుకుంటూ పోయారు. బ్రిటిషు వాళ్ళు పరిపాలించిన కాలంలోనే తుంగభద్ర మీద కూడా ఒక డ్యాం కట్టారు. మనం ఒక నది గురించి మాట్లాడుతున్నామంటే నది, దాని ఉపనదులు కలుపుకునే మాట్లాడతాం. నది, దాని ఉపనదులు, దానిలోకి వచ్చే వాగులు అన్నీ కలిపితేనే నది. శ్రీశైలం డ్యాం కంటే ఎగువన తుంగభద్ర వచ్చి కృష్ణలో కలుస్తుంది, దాని కంటే ఎగువన భీమా నది కర్ణాటక నుంచి వచ్చి మన బోర్డర్ దగ్గర కలుస్తుంది. తుంగభద్ర మీద కర్నూలు జిల్లాలోని సుంకేసుల అనే గ్రామం దగ్గర ఒక డ్యాం కట్టారు. విజయవాడ దగ్గర ప్రకాశం బ్యారేజీ, గోదావరి మీద ధవళేశ్వరం బ్యారేజీ రెండూ దాదాపు 19వ శతాబ్దపు మధ్యభాగంలో కడితే సుంకేసులను 19వ శతాబ్దపు చివరి భాగంలో కట్టారు. ఎందుకోసం కట్టారంటే కె.సి.కెనాల్ కోసం. సుంకేసుల దగ్గర కట్టిన ఆనకట్ట నుంచి కర్నూలు, కడప జిల్లాలకు నీళ్ళిచ్చే కాలువ తవ్వారు. అదే కె.సి.కెనాల్. అదీ బ్రిటిషు కాలంలోనే జరిగింది. రాయలసీమకు, తెలంగాణకు మధ్య కొంత దూరం వరకు తుంగభద్రే సరిహద్దు. ఆ తర్వాత, అంటే తుంగభద్ర కృష్ణలో కలిసిన తర్వాత కొంత దూరం కృష్ణానదే సరిహద్దు. ఆ దిగువన కోస్తాంధ్ర ప్రాంతంలోకి పోతుంది నది.

రాయలసీమ 1807 నుంచి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉంది. కానీ తెలంగాణ అంతా హైదరాబాద్ స్టేట్‌లో భాగంగా ఉంది. పెద్ద ప్రాజెక్టులేవీ కట్టలేదు వాళ్ళు. నిజాం కొన్ని చిన్న చిన్నవి కట్టాడు కాని పెద్దవి కట్టలేదు. అయితే చాలా ప్లాన్ చేశాడు. కృష్ణానదికి బాగా ఎగువన ఉన్న నారాయణపూర్‌లో పెద్ద ప్రాజెక్టు ఒకటి కట్టి గ్రావిటీ ద్వారానే తెలంగాణలో చాలా ప్రాంతాలకు నీళ్ళిచ్చే ప్లాన్ ఆయన చేశాడు. కాని అమలు చేయలేక పోయాడు.

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యాం చాలాకాలం కిందే వచ్చాయి. తుంగభద్ర మీద కట్టిన ఈ రెండు ప్రాజెక్టులు కర్ణాటకలో ఉన్నాయి. ఆర్‌డిఎస్ అంటే రాజోలిబండ డైవర్షన్ స్కీమ్. ఇది కర్ణాటకలో ఉన్నా దీని నుంచి ఎక్కువ నీళ్ళు వచ్చేది మన మహబూబ్‌నగర్ జిల్లాకే. కర్ణాటకకు కొంచెమే వస్తుంది. అందుకే వాళ్ళు ఎక్కువ పట్టించుకోలేదు. ఇప్పటికీ అది ఒక కంప్లైంట్‌గా అలాగే ఉంది. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ నిర్వహణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనే ఎందుకు తీసుకొని నడపదు? తీసుకోవాలని డిమాండులు ఎన్ని వచ్చినా కర్ణాటక ప్రభుత్వంతో అప్పుడప్పుడు చర్చలు జరుపుతుంటుంది కాని ఏమీ జరగదు. తుంగభద్ర డ్యాం హొస్పేటకు అవతల ఉంది. అది కర్ణాటకకు, మనకు కూడా నీళ్ళిస్తుంది. దాన్నుంచి మన రాష్ట్రానికి రెండు కాలువలు వస్తాయి. హైలెవల్ కెనాల్ అనంతపురం జిల్లాకు, లోలెవల్ కెనాల్ కర్నూలు జిల్లాకు నీళ్ళు ఇస్తాయి. ఇవన్నీ పాత ప్రాజెక్టులు. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానికి కొంచెం అటూ ఇటూగా వచ్చినటువంటి ప్రాజెక్టులే ఇవన్నీ కూడా. వీటిని కట్టేనాటికి నదీ జలాల పంపకం విషయంలో ఒక చట్టం గానీ, రాజ్యాంగ నియమం గానీ, ఒప్పందాలు గానీ, అగ్రిమెంట్లు గానీ ఏవీ లేవు అని చెప్పడం కోసం.

## జల వివాదాల పరిష్కార చట్టం

స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగం రాసుకున్నప్పుడు రాజ్యాంగంలో ఒక నియమం పెట్టారు. ఒక రాష్ట్రంలో పుట్టి, ఆ రాష్ట్రంలోనే సముద్రంలో కలిసిపోయే నది నీటిని ఏ విధంగా వినియోగించాలనేది రాజ్యాంగం చెప్పదు. ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలలో ప్రవహించే నది అయితే, అంటే అంతర్రాష్ట్ర నది అయితేనే ఆ నది నీటి వినియోగం, ఆ బేసిన్ అభివృద్ధి, దాని వివాదాల పరిష్కారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని చెయ్యొచ్చు. ఆ చట్టం ద్వారా వివాద పరిష్కారానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించవచ్చు. ఆ యంత్రాంగం తప్ప ఏ కోర్టు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి వీలు లేదని కూడా రూల్ పెట్టొచ్చు. 1956లో అటువంటి చట్టం

చేశారు. దాని పేరు Inter State Water Disputes Act. దాని కింద ఏం చెప్పారంటే అంతర్రాష్ట్ర నదీజలాల వినియోగం విషయంలో సంబంధిత రాష్ట్రాలలో ఏ ఒక్క రాష్ట్రమైనా (సంబంధిత రాష్ట్రాలు అంటే ఏ రాష్ట్రాలలో అయితే ఆ నది పరీవాహక ప్రాంతం ఉందో వాటిలో ఏ ఒక్క రాష్ట్రమైనా అని) తమ వివాదాన్ని పరిష్కారం చెయ్యడానికి ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చెయ్యమని కేంద్ర ప్రభుత్వాన్ని అడగొచ్చు. అడిగితే కేంద్రం తప్పనిసరిగా వెయ్యవలసిందే. బుద్ధిపుడితే వేస్తాము, లేకపోతే లేదు అనడానికి వీలు లేదు. అయితే ఏ రాష్ట్రం అడగకపోతే మాత్రం కేంద్రం తనపాటికి తను వెయ్యడానికి వీలులేదు. అంటే కేంద్రానికి అదనపు అధికారం ఏమీ లేకుండా చేశారు ఆ చట్టంలో. ఆ ట్రిబ్యునల్‌కు చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఉంటాడు. రిటైర్డ్ జడ్జి కాదు, సిట్టింగ్ జడ్జి. వారితో పాటు నీటిపారుదలకు సంబంధించిన నిపుణులు గానీ, వేరే ఎవరైనా గానీ దాంట్లో సభ్యులుగా ఉంటారు. ఈ తీర్పు మీద అప్పీలు ఉండదు. అంటే దానిని కరెక్టా, తప్పా అని మళ్ళీ సుప్రీంకోర్టులో, హైకోర్టులో కేసులు వేయడానికి ఆస్కారం ఉండదు. ఆ అవకాశం ఉంటే అది ఏళ్ళ తరబడి కోర్టుల్లో అపరిష్కృతంగా ఉండి పోతుందని భావించారు. అది జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో కోర్టులకు జోక్యం చేసుకునే అవకాశం ఇవ్వకుండా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, ట్రిబ్యునల్ తీర్పే అంతిమం అని చెప్పారు. ఈ తీర్పును అవార్డు అంటారు.

## రాష్ట్రం లోపల మన ఇష్టం

అయితే ట్రిబ్యునల్ ఈ రాష్ట్రానికి ఇంత వాటా, ఆ రాష్ట్రానికి ఇంత వాటా అని మాత్రమే నిర్ణయిస్తుంది. ఆ రాష్ట్రం లోపల వారు ఆ వాటాను ఏ రకంగా పంచుకుంటారు అనే విషయంలో ఎటువంటి పరిష్కార యంత్రాంగం లేదు. మన రాష్ట్రానికి సంబంధించి ఇది ఒక ముఖ్యమైన సమస్య. కృష్ణానది మహారాష్ట్రకు, కర్ణాటకకు, ఆంధ్రప్రదేశ్‌కు కామన్‌గా ఉండే అంతర్రాష్ట్ర నది. వివాదాల పరిష్కారానికి రెండు ట్రిబ్యునల్స్ వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ 1976లో అవార్డు ఇచ్చింది. 2000 సంవత్సరంలో ఆ అవార్డు అయిపోయింది. తర్వాత బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. అది రెండు మూడు నెలల్లో అవార్డు ఇవ్వబోతోంది. అందులో అది ఏం చెప్పినా ఒక రాష్ట్రం లోపల ఏ రకంగా వాడుకోవాలి అనేది మాత్రం చెప్పదు. నిజానికి ఒక ట్రిబ్యునల్ ముందుకు పోయినప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తాయంటే మా రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు మేము ప్రతిపాదించాము దానికింత నీళ్ళు కావాలి, మరో ప్రాజెక్టు కట్టబోతున్నాం దానికింత నీళ్ళు కావాలి అని లెక్కలు చూపి అడుగుతారు. సరే అని ట్రిబ్యునల్ ఒప్పుకుంటుంది అనుకోండి, ఒప్పుకున్న తరువాత కూడా ఆ

లెక్కల ప్రకారమే దానిని పంచుకోవాల్సిన అవసరం లేదు. ఆ రాష్ట్రం దానిని ఏ రకంగానైనా వాడుకోవచ్చు. ఈ అవగాహన లేకే ఆల్మట్టి మీద మన వాళ్ళు సుప్రీంకోర్టుకు పోయారు. ఆ రోజే మేమన్నాం, అనవసరంగా సుప్రీంకోర్టుకు పోయారని. కర్ణాటక కృష్ణానదిలో తన వాటాను కోరినప్పుడు చూపించింది వేరు, ఆ తర్వాత చేస్తున్నది వేరు అనే వాదన నిలిచేది కాదు. వాళ్ళు ఎట్లైనా వాడుకొంటారు. లాజిక్ కోసం, ఆర్గ్యుమెంట్ కోసం ఒకటి చూపిస్తారు, తరువాత పరిస్థితులు మారితే వేరే రకంగా వాడుకోవచ్చు. దీని గురించి ఆ రోజే మేము పత్రికల్లో వ్యాసాలు కూడా రాశాము, కానీ చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టుకు పోయి, లక్షలు ఖర్చుపెట్టి కేసు ఓడిపోయి వెనక్కి వచ్చాడు. సుప్రీంకోర్టు చివరికి అదే మాట చెప్పింది. ఒకసారి కేటాయించిన తరువాత ఆ రాష్ట్రం ఏ రకంగా అయినా వాడుకోవచ్చు. అది వాళ్ళ హక్కు. ఆ నీళ్ళు వాళ్ళవి. అంతవరకు బాగానే ఉంది కానీ రాష్ట్రం లోపల ఏ రకంగా వాడుకోవాలి అనే వివాదానికి రాజ్యాంగంలో ఏ పరిష్కారం లేదు. చట్టంలోనూ లేదు. అది దేనికి దారి తీస్తుంది అంటే వివాదం మొత్తం రాజకీయం కావడానికి దారితీస్తుంది. అలాకాక న్యాయబద్ధమైనటువంటి పరిష్కారాన్ని చూపించే మార్గం ఏదన్నా రాజ్యంగంలో ఉన్నా, చట్టాలలో ఉన్నా బాగుండేది. అది లేకపోవడంతో పూర్తిగా రాజకీయంగా మారిపోతున్నది. దానివల్ల రకరకాల సమస్యలు. జనాన్ని రెచ్చగొట్టేందుకు, కోపాలకు, ఆవేశాలకు, ప్రాంతీయ ద్వేషాలకు దారితీస్తోంది. ఆ విషయం తర్వాత చూద్దాం.

1956లో అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం వచ్చిందని చెప్పా కదా. మన రాష్ట్రంలో అప్పటికి కృష్ణానది మీద ప్రకాశం బ్యారేజీ ఒక్కటే ఉంది. దాదాపుగా కేంద్రంలో ఆ చట్టం చెయ్యడమూ, దాని గురించి అన్ని రాష్ట్రాలలో అవగాహన పెరగడమూ ఒకేసారి జరిగింది. అప్పటికే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదనలో ఉంది. ప్రతి ప్రాజెక్టు విషయంలో వంద సమస్యలున్నాయి. అయితే అవన్నీ ప్రస్తావించటం లేదు నేను. నాగార్జునసాగర్ ఎక్కడ కట్టారు, ఎక్కడ కట్టి ఉండవలసింది, తెలంగాణ వాళ్ళకు, రాయలసీమ వాళ్ళకు ఏమి హామీ ఇచ్చారు, చివరకు ఎట్లా మార్చారు– ఆ వివరాలలోకి పోవడం లేదు నేను. అదో పెద్ద కథ. సెంట్రల్ వాటర్ కమీషన్ దగ్గరకు పోయి అన్ని అనుమతులూ తెచ్చుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టును కట్టుకోవడం మొదలుపెట్టాం.

## సాగర్ 'ఘనత' కె.ఎల్.రావుది

మహారాష్ట్ర అప్పుడే అభ్యంతరాలు లేవదీసింది. ఇది మూడు రాష్ట్రాల ఉమ్మడి నది అయితే ఆంధ్రప్రదేశ్ వాళ్ళు విపరీతంగా కట్టేసుకుంటున్నారు ప్రాజెక్టులు, మీరు దానిని సాగనివ్వద్దు అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్రం ఏ నిర్ణయమూ

తీసుకోకముందే మనం నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తి చేసేసుకున్నాం. చాలా త్వరగా కట్టుకుంటూపోయాం. పూర్తవుతున్న ప్రాజెక్టును ఏం చేయగలరు? దాంట్లో ముఖ్యమైన పాత్ర కె.ఎల్.రావుగారిది. ఆయన నెహ్రూ కేబినెట్‌లో మంత్రిగా ఉండి ఈ పని చేశాడు. మనకు ఆయన హీరో కాని మీరు కర్ణాటక, మహారాష్ట్రలకు పోతే ఆయన్ని బాగా తిడతారు. కేంద్ర కేబినెట్‌లో ఉండి, దేశమంతటికి మంత్రిగా వ్యవహరించాల్సిన వాడు ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే మంత్రి అయినట్లు వ్యవహరించాడని తిడతారు– ఇప్పుడు వై.ఎస్. ఎట్లా కడప జిల్లాకు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉంటున్నాడని మిగతావాళ్ళు తిట్టుకుంటున్నారో అట్లా. మొత్తానికి మనం ఎవ్వరి అభ్యంతరాలకు అవకాశం లేకుండానే రెండు ప్రాజెక్టులు కట్టుకున్నాం– కృష్ణాడెల్టా వర్క్స్, నాగార్జునసాగర్. చిన్న చిన్నవి ఎట్లాగూ ఉన్నాయనుకోండి.

ఆ దశలో మహారాష్ట్ర వాళ్ళ అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం ఒక ట్రిబ్యునల్‌కు రిఫర్ చేసింది. ఆ ట్రిబ్యునల్‌కు అధ్యక్షుడు బచావత్ అని సుప్రీంకోర్టు జడ్జి. చాలా కష్టపడి పనిచేసే జడ్జి. ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు జడ్జీలు ఇట్లా లేరు. మీరు గాని అవార్డు చదివితే ఆయన ఎంత కష్టపడ్డాడో అర్థం అవుతుంది. అదే సమయంలో గోదావరి మీద కూడా ట్రిబ్యునల్ వేశారు. గోదావరి మనకు, ఒరిస్సాకు, మధ్యప్రదేశ్‌కు (ఛత్తీస్‌గఢ్), మహారాష్ట్రకు, కర్ణాటకకు ఉమ్మడి నది. నిజానికి రెండు నదులలోనూ నీళ్ళన్నీ వాళ్ళవే, మనవి కావు. వాడకం మాత్రం మనకే ఎక్కువ దిగువన ఉన్నాం కాబట్టి. ఎక్కువ నీళ్ళు అక్కడ పడే వర్షాలే. ఈ సంవత్సరం ఇంకా శ్రీరాంసాగర్‌కు నీళ్ళు రాలేదు. శ్రీశైలంకూ రాలేదు. అంటే అక్కడ ఇంకా వర్షం పడలేదు అని. పడమటి కనుమలలో వర్షం బాగా పడితే మనకు వర్షాలు లేకపోయినా పైనించి వచ్చే నీళ్ళను హాయిగా వాడుకుంటాం. ఎటొచ్చీ రాష్ట్రమంతటికీ అందడం లేదనే మన ఫిర్యాదు.

## గోదావరి ఒక పేజీ అవార్డు

అదట్లా ఉంచి గోదావరి మీద మనకు ధవళేశ్వరం దగ్గర బ్రిటిషు కాలంలో కట్టిన ఆనకట్ట ఒకటే ఉంది. వేరే పెద్దవేమీ లేవు. గోదావరి విషయంలో ఏం జరిగింది అంటే గోదావరిలో నీళ్ళెక్కువ కాబట్టి ఆ నీటి పంపకంలో పెద్ద వివాదాలేమీ లేవు. ఎక్కువ అంటే అప్పటి అవసరం, అప్పటి అంచనాను బట్టి ఎక్కువ. కాబట్టి రాష్ట్రాలన్నీ ముందుకొచ్చి ఒక ఒప్పందానికి వచ్చాయి. మీకింత, మీకింత, మీకింత అని మేమే ఒప్పుకుంటున్నాము అని వేసిస్తే దానినే ఆయన అవార్డుగా ఇచ్చాడు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు అంతా కలిపి ఒక పేజీ అవార్డు. వాళ్ళే ఒప్పుకుంటున్నారు

కాబట్టి దీనినే నేను అవార్డుగా ఇచ్చేస్తున్నానని చెప్పాడాయన. దాంట్లో మన వాటా 1480 టి.యం.సి.లు.

కృష్ణానది మీద మాత్రం విపరీతమైనటువంటి వివాదం జరిగింది. అన్ని రాష్ట్రాలు కూడా కొట్లాట పెట్టుకున్నాయి. మాకెక్కువ కావాలంటే మాకెక్కువ కావాలని. ఎందుకంటే కృష్ణానది పరీవాహక ప్రాంతమంతా కూడా వర్షాభావ ప్రాంతం.

## బచావత్ లెక్కలు

మన దగ్గర దాదాపు సాగర్ లేదా ప్రకాశం బ్యారేజీ దగ్గర మొదలుపెడితే ఎగువన ఒక పక్క రాయలసీమ, ఒక పక్క తెలంగాణ, తుంగభద్ర మీద ఇంకా ఎగువకు వెళితే బళ్ళారి జిల్లా, కృష్ణానది మీద పైకిపోతే గుల్బర్గా, దాదాపు పడమటి కనుమల దగ్గరకు పోయేంత వరకూ కూడా వర్షాభావ ప్రాంతాలే. పడమటి కనుమలలో బాగా వర్షం పడుతుంది. కాని పడమటి కనుమల దిగువన కృష్ణానది ఎక్కువగా వర్షాభావ ప్రాంతంలోనే ప్రవహిస్తుంది. మళ్ళా కోస్తా జిల్లాలలో ప్రవేశించిన తర్వాతే కృష్ణానది వర్షాలు పడే ప్రాంతంలో ప్రవహిస్తుంది. ఎక్కువగా వర్షాభావ ప్రాంతాలలో ప్రవహించే నది కావడం వలన కృష్ణానది నీటి మీద ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. మాక్కావాలంటే మాక్కావాలి అనేటువంటి డిమాండ్ చాలా ఉండింది. దాంతో సహజంగానే ఆంధ్రప్రదేశ్ మీద మిగిలిన రెండు రాష్ట్రాలు గొడవ పెట్టుకున్నాయి. వీళ్ళు ఇప్పటికే ఇంత తీసుకుంటున్నారు, ఇంక వాళ్ళకేమీ ఇయ్యొద్దు అని. దానికి బచావత్‌గారు ఏం చేశారంటే, ఎంత ఇవ్వాలి అంటే ముందు ఎంత ఉందో తెలుసుకోవాలి కదా. ఎంత నీళ్ళున్నాయి కృష్ణానదిలో అన్న అంచనా కోసం ఆయన మొట్టమొదట ఇంజనీర్లను పట్టుకొని వంద సంవత్సరాల సమాచారం తీసుకున్నాడు. ప్రతి సంవత్సరం ఒకే పరిమాణంలో నీరు ఉండదు కదా, ప్రవాహం రకరకాలుగా ఉంటూ ఉంటుంది. 75 శాతం డిపెండబిలిటీ అనే సూత్రం తీసుకున్నాడు. అన్ని సందర్భాలలోనూ దాన్ని ఉపయోగించరు కాని ఆయన తీసుకున్న ప్రమాణం అది. 75 శాతం డిపెండబిలిటీ ప్రకారం కృష్ణానదిలో మొత్తం 2060 టి.యం.సిల నీళ్ళు ఉంటాయని లెక్క తేల్చాడు. ఎక్కడ లెక్క పెట్టాడు ఆయన అంటే ప్రకాశం బ్యారేజీ దగ్గర. ఎందుకంటే పైన అప్పటికి ఎక్కువ ప్రాజెక్టులు లేవు గదా. నాగార్జునసాగర్ ఇంకా పూర్తి కాలేదు. అందువల్ల నదిలోకి వచ్చి చేరిన నీళ్ళంతా, కొద్ది కొద్ది వాడకం మినహాయిస్తే చివరకు అక్కడకు వచ్చేస్తుంది. కాబట్టి అక్కడ ప్రతి సంవత్సరం ఎంత నీరు అందుబాటులో ఉంటుందో డైరక్టుగా లెక్క ఎవరికీ తెలియదు కానీ ప్రవాహం లెక్కకట్టి దాన్నుంచి 2060 టి.యం.సిల నీళ్ళుంటాయని నిర్ధారించాడు.

75 శాతం డిపెండబిలిటీ అంటే– నాలుగింట మూడు సంవత్సరాలు అందుబాటులో ఉండే నీళ్ళని. నాలుగింట మూడు సంవత్సరాలు 2060 టి.యం.సిల నీళ్ళు ఉంటాయని ఒక అంచనాకు వచ్చాడు ఆయన. 75 శాతం డిపెండబిలిటీ తీసుకోకుండా 60 శాతం డిపెండబిలిటీ తీసుకుంటే ఇంకా ఎక్కువ అందుబాటులో ఉంటుంది. అంటే అయిదింట మూడు సంవత్సరాలు ఎంత నీరు ఉంటుందంటే ఇంకా ఎక్కువ ఉంటుంది. అలాగే ఆరింట మూడు సంవత్సరాలు తీసుకుంటే ఇంకా కూడా ఎక్కువ ఉంటుంది. కానీ 75 శాతం డిపెండబిలిటీ ఎందుకు తీసుకున్నారు అనంటే, నాలుగింట మూడేళ్ళు ఈ మాత్రం నీళ్ళు నాకు దక్కుతాయి అన్న భరోసా రైతుకు ఉంటుందని. రైతుకు ఆ మాత్రం భరోసా కూడా లేని ప్రాజెక్టులు కట్టడం న్యాయం కాదు అన్న అభిప్రాయంతో 75 శాతం డిపెండబిలిటీ తీసుకున్నాడు. 75 శాతం డిపెండబిలిటీ ప్రకారం సగటున ప్రతి నాలుగేళ్ళలో మూడేళ్ళు ఆ నీరు అందుబాటులో ఉంటుంది. వీటినే నికర జలాలు అంటున్నాం. ఏ సంవత్సరం అయినా అంతకంటే తక్కువ ఉంటే చెయ్యగలిగింది ఏమీ లేదు. కానీ ఎక్కువ ఉండొచ్చు కదా. అప్పుడా నీటిని మిగులు జలాలు అంటున్నాం. అంటే 2060 టి.యం.సి.ల కంటే ఎక్కువ ప్రవాహం ఏ రోజైనా– ఏ సంవత్సరం అయినా కృష్ణానదిలో ఉంటే దానిని మిగులు జలాలు అంటారు. నీళ్ళు నీళ్ళే, అది నికర జలం అయినా అదే పంట పండుతుంది, మిగులు జలం అయినా అదే పంట పండుతుంది. కానీ హక్కులు కల్పించేటప్పుడు కనీస గ్యారంటీ లేకుండా హక్కులు కల్పిస్తే అది హక్కు అనే భావననే అభాసుపాలు చెయ్యడం అవుతుంది. కాబట్టి కనీసం నాలుగేళ్ళలో మూడేళ్ళయినా నీకీ మాత్రం నీళ్ళు దొరుకుతుంది అని చెప్పాలి అంటే 2060 టి.యం.సి.ల వరకే మనం హక్కులు కల్పించాలి. అవే నికర జలాలు. ఆపైన ఏ సంవత్సరం అయినా ఉండవచ్చును. వాటికి మిగులు జలాలు లేదా సర్‌ప్లస్ వాటర్ అని ఆయన పేరు పెట్టారు.

## ఒక టి.యం.సి. అంటే....

ఇప్పుడు ఈ టి.యం.సి. అంటే ఏమిటో కొంచెం చెప్పుకుంటే మీకు ఈ సమస్య ఇంకా బాగా అర్థం అవుతుంది. టి.యం.సి. అంటే థౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్. అంటే వంద కోట్ల ఘనపుటడుగులు. ఒక ఘనపుటడుగు అంటే ఊహిస్తారు కదా. ఒక అడుగు పొడవు, ఒక అడుగు వెడల్పు, ఒక అడుగు ఎత్తు ఉన్న ఒక ఐస్ క్యూబ్‌ను ఊహించుకోండి. అటువంటివి వందకోట్లు ఊహించుకోండి. అదీ ఒక టి.యం.సి. అంటే. ఊహించలేము మనం. కాబట్టి దానికి ఇంకొక మార్గమేమిటీ అంటే ఒక టి.యం.సి.ని దేనికి వాడుకోవచ్చో చెప్పుకుంటే మనకు ఒక అంచనా

వస్తుంది. ఒక టి.యం.సి. నీటి ప్రవాహంతో ఆరువేల ఎకరాల తరి లేక మాగాణి పంట పండించుకోవచ్చు. అదే ఇరిగేటెడ్ డ్రై లేదా ఆరుతడి పంటయితే 10,000 ఎకరాలు దాకా పండించుకోవచ్చనేది మామూలుగా ఉండేటటువంటి ఒక అంచనా. రాజశేఖర్‌రెడ్డి వచ్చిన తరువాత 'డ్రిప్ ఇరిగేషన్' ద్వారా 22 వేల ఎకరాల దాకా కూడా పారించుకోవచ్చని ఆయన కనిపెట్టాడు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో కడుతున్న దేవాదుల ప్రాజెక్టులో 22 వేల ఎకరాలకు పంచుతారట ఒక టి.యం.సి. నీళ్ళను. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వాడుకోవాలి వాళ్ళు దానిని. అది సాధ్యమవుతుందా లేదా అనేది రాబోయే రోజులలో చూడాలి. తెలంగాణ వాళ్ళకు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావాలంటే ఇవన్నీ అర్థం కావాలి. ఇలాంటివి చేసినప్పుడు ఎవరికైనా సకారణంగానే కోపం వస్తుంది. అయితే ఆయనగారి పులివెందులకు కూడా ఆయన డ్రిప్ ఇరిగేషనే పెట్టాడు. పులివెందుల నియోజక వర్గంలో రెండు లక్షల ఎకరాలకు నీళ్ళిస్తున్నాడు. ఆ మేరకు సమభావమే పాటిస్తున్నాడు వరంగల్‌కూ, పులివెందులకూ.

ఇంకొక రకంగా చెప్పుకోవాలంటే చెరువును ఉదాహరణగా తీసుకుందాం. ఒక సగటు చెరువు స్టోరేజి కెపాసిటీ టి.యం.సి.లో పదో వంతు. అంటే మనం మరీ పెద్దది కాదు, మరీ చిన్నది కాదు అనుకునే చెరువు స్టోరేజి కెపాసిటీ టి.యం.సి.లో పదోవంతు కాబట్టి ఒక టి.యం.సి. అంటే పది చెరువులు అనుకోండి. తెలంగాణలో ఉన్నటువంటి చెరువుల సగటు సామర్థ్యం టి.యం.సి.లో పదవ వంతు అని ఒక లెక్క, దాని ప్రకారం చెపుతున్నాను. తెలంగాణలో 5000 చెరువులు ఇప్పటికీ బతికి ఉన్నాయని అంటారు కాబట్టి వాటి సామర్థ్యం 500 టి.యం.సి.లని లెక్క వేసుకోవచ్చు.

## వెనకబడిన ప్రాంతాల పేరు చెప్పి...

మళ్ళీ బచావత్ దగ్గరకు వద్దాం. 75 శాతం డిపెండబిలిటీ సూత్రం ప్రకారం ఆయన లెక్క కట్టింది 2060 టి.యం.సిల నీటిని కదా. ఎక్కువ నీళ్ళు అడగటానికి మూడు రాష్ట్రాలూ పోటీ పడ్డాయి. తమ తమ రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాల గురించి వాళ్ళాయన దగ్గర కన్నీళ్ళు పెట్టుకున్నారు. మా రాష్ట్రంలో ఎడారి ప్రాంతం లాంటి అనంతపురం ఉంది, మహబూబ్‌నగర్ ఉంది అని మన వాళ్ళు; మాకు ఎడారి అయిపోతున్న గుల్బర్గా ఉంది అని కర్ణాటక వాళ్ళు– తర్వాత వాళ్ళకు నీళ్ళిస్తారా లేదా అనేది వేరే సంగతి– ఏడ్చేటప్పుడు ఈ జిల్లాల పేర్లు చెప్పి ఏడుస్తారక్కడ. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆ రాష్ట్రాలు ఏమన్నాయంటే ఇప్పటికే వాళ్ళు చాలా ఎక్కువ తీసుకుంటున్నారని. ఇక్కడ ప్రధానంగా క్యాచ్‌మెంట్ (పరీవాహక ప్రాంతం) అన్న ఆర్గ్యుమెంట్ ఒకటి ఆ రాష్ట్రాలు తీసుకొచ్చాయి. దాన్ని సులభంగా అర్థం

చేసుకోవాలంటే  ప్రతి నదికి కూడా ఎక్కడెక్కడో పడిన వర్షం చిన్నచిన్న వాగులు, వంకలు ద్వారా నదిలోకి చేరుతుంది. ఆ చేరవేసే ప్రాంతాన్ని మనం క్యాచ్‌మెంట్ అందాం ప్రస్తుతానికి దాని టెక్నికాలిటీస్‌లోకి పోకుండా. క్యాచ్‌మెంట్ ఈల్డ్ (దిగుబడి) ఎంత అన్నది ఒకటి, క్యాచ్‌మెంట్ వైశాల్యం ఎంత అన్నది ఒకటి. ఎంత ప్రాంతం నుంచి నీరు నదిలోకి చేరుతుందనేది వైశాల్యం అయితే, ఎంత నీళ్ళు వాస్తవానికి చేరుతుందనేది ఈల్డ్. వర్షం పడితే ఈల్డ్ ఎక్కువ ఉంటుంది, లేకపోతే తక్కువ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో క్యాచ్‌మెంటూ తక్కువే, ఈల్డూ తక్కువే.


కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని షిమోగా, ఉడిపి ప్రాంతాలలో 4000, 3500 మి.మీ చొప్పున సగటు వర్షపాతం ఉంటే మన దగ్గర మహబూబ్‌నగర్‌లో 500 మి.మీ, కర్నూలులో 500 మి.మీ, అనంతపురంలో 450 మి.మీ ఉంది. కృష్ణానదికి మా కంట్రిబ్యూషన్ ఎక్కువ కాబట్టి ఎక్కువ నీరు మాకే ఇవ్వాలి అని కర్ణాటక అంది. మావి కరువు ప్రాంతాలు కాబట్టి మాకు ఎక్కువ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అడిగింది. బచావత్ తీసుకున్న వైఖరి ఏమిటంటే ఇప్పటికే కట్టేసిన ప్రాజెక్టులు, వాటి స్థాయిని కదిలించము అని. కృష్ణాడెల్టా వర్క్స్, నాగార్జున సాగర్‌లను అప్పటికే కట్టేసుకున్నారు కాబట్టి, కట్టేసిన వాటిని కూల్చేయాలని ఎవరూ చెప్పరు గానీ ఆయన ఆ రోజే వాటి ఆయకట్టును తగ్గిద్దాం, వాటి నీటి కేటాయింపు తగ్గిద్దాం అనుంటే ఏమయ్యుండేదో చెప్పలేము. ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన మేలు అది. అందుకే బచావత్ అవార్డును మనమే మెచ్చుకుంటాం. కర్ణాటకలో, మహారాష్ట్రలో తిడతారు. కె.ఎల్.రావు ఎలాగో బచావత్ కూడా అలాగే వాళ్ళకు. ప్రాజెక్టులు కూల్చమని ఎవ్వరూ చెప్పరు, ఉన్న ప్రాజెక్టు ఉంటుంది. కానీ రెండు పంటలకు బదులు ఒక పంటకే ఇవ్వండని అనుండొచ్చు. ఆయకట్టు తగ్గించమని, టెయిల్‌ఎండ్ తగ్గించమని చెప్పి ఉండవచ్చు. ఆయన అట్లా చెప్పకుండా ఎంత కేటాయింపు ఉందో అంత కేటాయింపు అట్లాగే కొనసాగుతుంది అనడం వలన ఏమయ్యిందీ అంటే మన ఈల్డ్ కంటే, మన క్యాచ్‌మెంట్ కంటే ఎక్కువ నీళ్ళనే మనం తీసుకోగలుగుతున్నాం. అయినా ఇంకా కావాలని అడిగారు మనవాళ్ళు ప్రధానంగా అనంతపురాన్ని, మహబూబ్‌నగర్‌ను చూపించి. ఇప్పటికీ ఆ రెండు జిల్లాలను చూపుతూ ఉంటారు కదా కరువు అంటే. బచావత్‌గారు ఏం చేశారంటే అంత ఇవ్వలేము కానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాలకు మాత్రం 17.84 టి.యం.సి.ల కేటాయింపు చేశారు. ఈ ప్రాజెక్టు దాదాపు కృష్ణానది ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహించే చోట ఉంది. తెలంగాణ వాళ్ళకు కోపం రావడానికి మరో కారణం ఏమిటంటే 1970లలో బచావత్ ట్రిబ్యునల్ దానికి 17.84 టి.యం.సి.ల కేటాయింపు ఇస్తే ఇవ్వాళ్టికీ 11.5 టి.యం.సి.లతో మాత్రమే జూరాల


ప్రాజెక్టు కట్టబడింది. ఎందుకంటే ఇంకా ఎక్కువ కెపాసిటీతో కడితే కర్ణాటక వాళ్ళ భూమి మునుగుతుంది, మునిగితే నష్ట పరిహారం ఇవ్వాలి. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి, ఇవ్వాల్సిన పైసలు ఇచ్చి, ఆ మాత్రం ఎందుకు పూర్తి చెయ్యరు? ఆ పని అయిదు సంవత్సరాల జలయజ్ఞం తరువాత నిన్న మొన్న మొదలుపెట్టారు. జలయజ్ఞంలో ప్రధానమైన అంశం కూడా కాదు అది.

## ప్రిస్క్రిప్టివ్ రైట్


జూరాలకు మినహా అనంతపురానికి గానీ, కర్నూలుకు గానీ, వేరే వెనుకబడిన ప్రాంతాలకు గానీ బచావత్ అవార్డులో ఎటువంటి కేటాయింపు రాలేదు. అయితేనేం కృష్ణానదిలోని 2060 టి.యం.సిలలో మనకు 800 టి.యం.సిలు, కర్ణాటకకు 700 టి.యం.సి.లు, మహారాష్ట్రకు 560 టి.యం.సి.లు ఇచ్చారు. ఎక్కువ నీళ్ళు వాళ్ళవైనా కేటాయింపు మనకే ఎక్కువ. ఎందుకంటే ముందే కట్టుకున్నాం కాబట్టి. 'లా' లో ప్రిస్క్రిప్టివ్ రైట్ అంటారు. లా చదువుకున్న వాళ్ళకు తెలిసే ఉంటుంది, ముందే వచ్చి ఆక్రమించుకున్నవాడికి 'బై ప్రిస్క్రిప్షన్ హి హేజ్ యె రైట్' అని చెపుతారు. వెనక వచ్చిన వాడు దొంగ, ముందు తీసుకున్న వాడు దొర. మనం ముందు తీసేసుకున్నాం కాబట్టి మనం దొరలపోయాం. మనం మన నీళ్ళుగా భావించే 800 టి.యం.సి.ల నికర జలాల్లో 200 టి.యం.సిలు కర్ణాటక నుంచి వస్తాయి ప్రతి సంవత్సరం. క్యాచ్‌మెంట్ ప్రకారం నీళ్ళు పంచాలి అనంటే ఆ 200 టి.యం.సి.లు ముందు వాళ్ళకే ఇచ్చేయాలి. ఎందుకంటే అవి వాళ్ళ నీళ్ళు– వాళ్ళ నీళ్లు మన నీళ్ళు అనదలచుకుంటే. అందుకే మేము మొదటే అన్నాం, నీళ్ళు ఎవరివీ కావు, అవి ప్రకృతిలో భాగంగా వచ్చాయి. ముందు కట్టేసుకున్నంత మాత్రాన అంత నీరు ఎందుకివ్వాలి? తగ్గించి, కావాలంటే ఆంధ్రప్రదేశ్‌లోనే వెనకబడిన ప్రాంతాలకు కొంత తీసుకోండి అనుండొచ్చు బచావత్. కాని ఆయన అనలేదు. అది అట్లాగే ఉండిపోయింది.

అయితే కథ అక్కడితో అయిపోలేదు. అయిపోతే ఈ మిగిలినవన్నీ మనకు చర్చకే కావు. ఆ తరువాత ఏం జరిగిందంటే – బచావత్ అవార్డు గడువు అయిపోయింది. దాని గడువు 1976 నుంచి 2000 సంవత్సరం దాకానే. ఆ తరువాత ఏదన్నా వివాదం లేవదీసుకోవాలి, మళ్ళీ ఫ్రెష్‌గా అవార్డు తెచ్చుకోవాలి. మనవాళ్ళు ఏం చేశారంటే కాలువలను ఆధునీకరించడం ద్వారా మేము వృధా లేకుండా చేసుకున్నాము. అట్లాగే రిటర్న్ ఫ్లో అనేది కొంత ఉంటుంది ప్రాజెక్టుల్లో. అంటే ప్రాజెక్టుల నీళ్ళు పొలాలకు పెట్టిన తరువాత కొంత డ్రెయిన్స్ ద్వారా తిరిగి అదే నదిలోకి వస్తుందని


GODAVARI BASIN PROJECTS
0.00 Km
Nasik
274 Km
Jayakwadi
Singur (1717')
Ghanpur Anicut
NSP (1405')
Manjira River
686 Km
Alisagar LIS
Gutpa LIS
NSP: Nizam Sagar Project
MMD: Mid Maner Dam
LMD: Lower Maner Dam
UMD: Upper Maner Dam
FFC: Flood Flow Canal
SRSP: Sri Ram Sagar Project
764 Km
Sri Ram Sagar Project (1091')
GODAVARI RIVER
UMD
Maneru
MMD (920')
SRSP Stage-I
Saraswathi canal
LMD
Kakatiya canal
Kadem River
Kadem canal
FFC
288 Km
284 Km
905 Km
Yellampally Barrage
Irrigation pipeline
Ralivagu
Gollavagu
NTPC pipeline
998 Km
Pranahita River +492'
SRSP Stage-II
1046 Km
Indravati River
1065 Km
Ichampally Project
346 Km
1072 Km
GLIS (230')
SACB: Sir Arthur Cotton Barrage
PLMC: Polavaram Left Main canal
PRMC: Polavaram Right Main canal
CDC: Central Delta Canal
GLIS: Godavari Lift Irrigation Scheme
Dummugudem LI & HEP (160')
1162 KM
1268 Km
Sabari
Sileru
1312 Km
Polavaram Project (150')
PRMC
Thadipudi LIS
Pushkaram LIS
PLMC
1368 Km
SACB (70')
Western canal
CDC
Eastern canal
1465 Km
BAY OF BENGAL



KRISHNA BASIN PROJECTS
Mahabaleshwar
0.00 Km
Almatti Dam
526 Km
Narayanapur Dam
573 Km
Bhima LIS
SILL: +1033’
Q: 20 TMC
Bhima River
778 Km
Nettempadu LIS
Q: 20 TMC
Koilsagar(5 TMC)
PJP
FRL: +1045’
848 Km
KRISHNA RIVER
TB Dam
Sunkesula
Barrage
917 Km
Tungabhadra
River
RDS
SRBC & GNSS
Pothireddypadu
Head Regulator
HNSS (40 TMC)
Kalwakurthi LIS
Q: 25 TMC
SILL: 802’
Escape Regulator
to Nippulavagu
B
C
R
KC Canal
Srisailam
MDDL: 834’
FRL: 885’
1026 Km
TGP
VBR
PVBBR
SBR
KBR
Veligonda Project
FRL: 875’
Q: 43.5 TMC
AMRP
Q: 30 TMC
SILL: 495’
Nagarjunasagar
Reservoir
FRL: 590’
1126 Km
TGP : 29.0 TMC
VGP : 43.5 TMC
GNSS: 38.0 TMC
HNSS: 40.0 TMC
KLI : 25.0 TMC
NLI : 20.0 TMC
KSLI : 5.0 TMC
Musi (1168 Km)
Pulichintala
Project
1211 Km
Paleru (1226 Km)
Munneru (1270 Km)
Prakasam
Barrage
1311 Km
1440 Km
BAY OF BENGAL
VBR : Velugodu Balancing Reservoir
PVBBR: Pothuluri Veerabrahmendraswamy Balancing Reservoir
SBR : Somasila Balancing Reservoir
KBR : Kandaleru Balancing Reservoir
VGP : Veligonda Project
TGP : Teluguganga Project
KC Canal: Kurnool-Kadapa Canal
HNSS : Handri - Neeva Sujala Sravanthi
GNSS : Galeru - Nagari Sujala Sravanthi
AMRP: Alimineti Madhava Reddy Project
PJP : Priyadarshini Jurala Project
KLI : Kalwakurthy Lift Irrigation
NLI : Nettempadu Lift Irrigation
KSLI : Koil Sagar Lift Irrigation
BCR : Banakacharla Cross Regulator


# PENNA BASIN PROJECTS





CBR: Chitravati Balancing Reservoir
PABR: Penna-Ahobilam Balancing Reservoir
TGP Canal: Teluguganga Project Canal
TBPLLC: Tungabhadra Project Low Level Canal
TBPHLC: Tungabhadra Project High Level Canal

CB: Chagallu Barrage
GD: Gandikota Dam
MPR: Mid-Pennar Reservoir
SFC: South Feeder Canal


GODAVARI BASIN PROJECTS
Origin Triambakeshwar, Nasik, Maharshtra
Jayakwadi
Capacity = 103 TMC
Ayacut = 6.5 lakh Ac
FRL
+463.9 m
274 Km
430 Km
MAHARASHTRA
Sri Ram Sagar Project Stage-I
Allocation = 145.35 TMC
Ayacut = 9.69 lakh Ac
Stage- II & FFC Under Progress
FRL
+322.52 m
60 Km
Sripadasagar
(Yellampally Project)
Allocation = 63 TMC
Ayacut = 2.20 lakh Ac
FRL
+148 m
141 Km
167 Km
J.Chokkarao Devadula LIS
Water Allocated = 38.18 TMC
Ayacut = 6.21 lakh Ac
240 Km
Polavaram
Allocation = 301.38 TMC
Ayacut = 7.20 lakh Ac
FRL
+45.72 m
56 Km
SACB
Allocation = 263.60 TMC
Ayacut = 10.13 lakh Ac
FRL
+21.34 m
97 Km
BAY OF BENGAL
ANDHRA PRADESH
Sri Ram Sagar Project Stage - I
Allocation = 145.35 TMC
Ayacut = 9.69 lakh Ac
Stage - II & FFC Under Progress
Completed Project
Polavaram
Allocation = 301.38 TMC
Ayacut = 7.20 lakh Ac
Ongoing Project
SACB: Sir Arthur Cotton Barrage
FRL: Full Reservoir Level
MCM: Million Cubic Meters
ha: Hectare
1 TMC = 28.317 MCM
I ha = 2.4711 Acres


KRISHNA BASIN PROJECTS
LIS: Lift Irrigation Scheme
FRL: Full Reservoir Level
MCM: Million Cubic Meters
ha: Hectare
1 TMC = 28.317 MCM
I ha = 2.4711 Acres
Ac = Acres
Almatti Dam
Allocation = 54 TMC
Ayacut = 15.36 lakh Ac
(Total ayacut under UKP)
FRL +519.66 m
526 Km
Origin Mahabaleshwar, Maharashtra
47 Km
FRL +492.22 m
Narayanapur Dam
Allocation = 119 TMC
275 Km
Bhima LIS
Nettempadu LIS
FRL +318.5 m
Jurala
Allocation = 17.84 TMC
Ayacut = 1.02 lakh Ac
176 Km
Kalwakurthy LIS
HNSS
SRBC / GNSS
FRL +269.73 m
Srisailam Dam
Capacity = 308 TMC
AMRP LIS
100 Km
FRL +179.82 m
Nagarjunasagar Dam
Allocation = 281 TMC
Ayacut = 21.43 lakh Ac
85 Km
FRL +53.34 m
Pulichinthala
Allocation = 9 TMC
Capacity = 45.77 TMC
100 Km
FRL +17.39 m
Prakasam Barrage
Allocation = 181.20 TMC
Ayacut = 13.08 lakh Ac
129 Km
BAY OF BENGAL
KARNATAKA
ANDHRA PRADESH
Jurala
Allocation = 17.84 TMC
Ayacut = 1.02 lakh Ac
Completed Project
HNSS
Ongoing Project


PENNA BASIN PROJECTS
origin Nandi Hills, KARNATAKA
UPP
Capacity = 1.81 TMC
Ayacut = 10,048 Ac
FRL +536.45 m
168 Km
PABR
Capacity = 11.10 TMC
Ayacut = 1.0 lakh Ac
FRL +443 m
52 Km
Mid Pennar Dam
Capacity = 4.41 TMC
Ayacut = 77,632 Ac
FRL +365.76 m
20 Km
Chagallu Barrage
Capacity = 1.65 TMC
Ayacut = 4500 Ac
FRL +265.93 m
55 Km
Gandikota Dam
Capacity = 26.85 TMC
Ayacut = 26,000 Ac
FRL +212 m
40 Km
Gandikota LIS (Surplus)
GR CBR LIS (6 Lifts)
Mylavaram Dam
Capacity = 9.96 TMC
Ayacut = 75,000 Ac
FRL +202.65 m
11 Km
Modernisation of
Mylavaram Canal
Somasila Project
Allocation = 48.53 TMC
Ayacut = 1.39 lakh Ac
FRL +100.58 m
130 Km
Sangam Anicut
Allocation = 15 TMC
Ayacut = 1.5 lakh Ac
FRL +30.01 m
52 Km
Nellore Anicut
Allocation = 10 TMC
Ayacut = 97,000 Ac
FRL +20.79 m
35 Km
34 Km
BAY OF BENGAL
PABR
Capacity = 11.10 TMC
Ayacut = 1.0 lakh Ac
Completed Project
Chagallu Barrage
Capacity = 1.65 TMC
Ayacut = 4500 Ac
Ongoing Project
PABR: Penna- Ahobilam Balancing Reservoir
UPP: Upper Penna Project
FRL: Full Reservoir Level
MCM: Million Cubic Meters
ha: Hectare
1 TMC = 28.317 MCM
I ha = 2.4711 Acres

లెక్క ఒకటి ఉంటుంది. వీటికి కచ్చితమైన లెక్కలు ఏమీ లేవు కానీ, ప్రాజెక్టుల కాలువల్ని ఆధునీకరించామని చెప్పి మనవాళ్ళు ఏమన్నారంటే నికర జలాల్లోనే ఒక 48 టి.యం.సి.లు మిగుల్చుకున్నాం కాబట్టి వాటికి కూడా మాకు అనుమతులు కావాలని చెప్పి 'సెంట్రల్ వాటర్ కమిషన్'కు అప్లికేషన్ పెట్టుకున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ దానికి ఒప్పుకుని మూడు ప్రాంతాలకు మూడు ప్రాజెక్టులను ఆ 48 టి.యం.సిలలో కేటాయించింది. ఒకటి పులిచింతల– దీనికి 9 టి.యం.సి.లు. రెండవది భీమా–దీనికి 20 టి.యం.సిలు. మూడవది శ్రీశైలం కుడిగట్టు కాలువ– దీనికి 19 టి.యం.సిలు. కుడిగట్టు కాలువ అంటే కర్నూలు, కడప జిల్లాలకు, ప్రధానంగా కర్నూలు జిల్లాకు నీళ్ళందించే కాలవ. 48 టి.యం.సిలు మిగిల్చామన్నారు కాబట్టి దానిని పంచి - అప్పటికే ఈ ప్రాంతీయ ఫీలింగ్ వచ్చేసింది కాబట్టి - తెలంగాణకు 20 టి.యం.సిలు, రాయలసీమకు 19 టి.యం.సిలు, ఆంధ్రాకు 9 టి.యం.సిలు అని కేటాయించారు. 1980లలో ఈ పంపకం జరిగింది.

తెలంగాణలో కానీ, రాయలసీమలో కానీ కరువు ఎక్కువ కాబట్టి ఈ కేటాయింపులు సరిపోలేదు. అంతకుముందు కట్టేసుకున్నదంతా కోస్తా జిల్లాలకే పోతోంది. నాగార్జున సాగర్ నుంచి కూడా కొంత భాగం మాత్రమే నల్గొండకు వస్తుంది. నల్గొండకు వచ్చింది మళ్ళీ కృష్ణా జిల్లాకు పోతుంది. బాగా కరువున్నటువంటి దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు ఇంకా అవసరం ఉంది. కాని నికర జలాలు అయిపోయినాయి. నికర జలాలలో కాలువలు బాగు చేసి ఆదా చేసుకున్నామని చెప్పిన 48 టి.యం.సిల పంపకం కూడా అయిపోయింది. ఇంకా కావాలంటే ఏమి చెయ్యాలి అనుకున్నప్పుడు మన వాళ్ళకు మిగులు జలాల మీద కన్ను పడింది.

## అక్రమాలకు తెర తీసిందిలా...

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత రాయలసీమ నాయకులు ఆయన మీద బాగా ఒత్తిడి పెట్టారు. ఆయనకేమీ తెలియదు. తను దేవుడిని అనుకొనేవాడు ఆయన. అందుకే తనకు ఓటేశారని, తను ఏమైనా చెయ్యవచ్చని అనుకున్నాడు. రాజ్యాంగమూ, చట్టమూ, అవార్డులు వంటివి ఉన్నాయని పట్టించుకోలేదు ఆయన. బచావత్, తెలుగు పేరు కూడా కాదు అది, దేవుడి పేరు అసలేకాదు, ఎందుకు పట్టించుకోవాలి అనుకున్నాడేమో. అలాంటి ఎన్.టి.ఆర్‌ను పట్టుకొని ఇదే రాజశేఖరరెడ్డి, ఇదే మైసూరారెడ్డి, ఇదే రమణారెడ్డి, ఇవ్వాళ కొందరు కాంగ్రెసులో, కొందరు టిడిపిలో, కొందరు ప్రజారాజ్యంలో ఉన్నారు గానీ, ఆనాడు వాళ్ళందరూ కూడా చాలా ఒత్తిడి పెట్టి మిగులు జలాలను కడప, కర్నూలు జిల్లాలకు కేటాయింప

జేసుకున్నారు. ఆ జిల్లాలకు నీటి అవసరం లేదని నేను అనడం లేదు. వాస్తవంగా కూడా అవి బాగా వెనకబడిన ప్రాంతాలు. అయితే మనం అక్రమంగా పోతే ఆ అక్రమాన్ని వేరే వాళ్ళు కూడా చేయగలరన్న విషయం మరిచిపోకూడదు. అక్రమానికి ఎప్పుడూ నియమం ఉండదు. అది నియమ రహితంగా ఉండటం కూడా ప్రాంతీయ ద్వేషాలను రెచ్చగొడుతుంది.

ఒత్తిడి పెట్టటానికి వాళ్ళకు అవకాశం ఎక్కడ దొరికింది అంటే కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లు బచావత్ దగ్గర కూర్చొని మాట్లాడుకునేటప్పుడే మద్రాసు సిటీకి నీళ్ళు కావాలంటూ తమిళనాడు వాళ్ళు ఒక అర్జీ పెట్టారు. మద్రాసు సిటీ చాలా వర్షాభావమున్నటువంటి సిటీ. అందువల్ల మద్రాసు సిటీకి నీళ్ళివ్వండి అని చెప్పి బచావత్ అవార్డులో చెప్పారు. మూడు రాష్ట్రాలు అందుకు ఒప్పుకున్నాయి. దాంతో శ్రీశైలం డ్యాం నుంచి 15 టి.యం.సిలు తీసుకుపోవడానికి కాలువ తవ్వే అవకాశం దొరికింది. ఒరిజినల్‌గా అది కేవలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కోసం కట్టిన డ్యాం. దానికి కాలువలు ఉండవు. స్టోరేజి మాత్రమే ఉంటుంది. నీళ్ళు కిందకి పోతాయి, టర్బైన్ టర్న్ అవుతుంది, కరెంట్ ఉత్పత్తి అవుతుంది. కానీ మద్రాసుకు తాగునీరు ఇవ్వడానికి కాలువ తవ్వే అవకాశం దొరికింది. కుడి పక్క నుంచి పోతుంది ఆ కాలువ. ఆ కాలువ తవ్వడం అనేది కాకతాళీయంగా ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత మొదలైంది. అప్పుడు వీళ్ళందరూ కూడా రాయలసీమకూ నీళ్ళు ఇవ్వాలి అని పెద్ద ఆందోళన చేసి సాధించుకున్నారు. న్యాయమైనటువంటి కోరికే, కాదనడం లేదు కానీ, అనుసరించిన పద్ధతే బాగా లేదు. చాలా ఒత్తిడి పెట్టి ఏం చేశారంటే ఎట్లాగూ మద్రాసుకు తీసుకుపోతున్నావు కదా, ఇంకొంచెం రాయలసీమకు కూడా ఇవ్వు అని చెప్పి ఆ కాలువ కుండే రెగ్యులేటర్‌ను మరింత వెడల్పు చేయించారు. ఆ కాలువను రెగ్యులేట్ చేసే గేట్లు ఉంటాయి కదా, అదే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. నిజానికి అక్కడ ఉండేటటువంటి గ్రామం పేరు పోతులపాడు. ఈ రాజశేఖర్‌రెడ్డి, మైసూరారెడ్డి, రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వీళ్ళందరూ పోయి దానిని పోతిరెడ్డిపాడుగా మార్చి, మద్రాసుకు 15 టి.యం.సి.లు తీసుకుపోవడానికి ఎంత వెడల్పు అవసరమో దానికంటే ఇంకా ఎక్కువ వెడల్పు తప్పనిసరిగా చేయాలని చెప్పి గొడవ పెట్టి మరీ చేయించారు. చేయించి ఏం చేశారంటే మద్రాసుకు వెళ్ళే 15 టి.యం.సి.లే కాకుండా తమ జిల్లాలకు మరొక 29.8 టి.యం.సిలు కేటాయింప జేసుకున్నారు. దీనిలో కొంత కర్నూలుకు, ఎక్కువ భాగం కడపకు, అంతకంటే ఎక్కువ భాగం నెల్లూరుకు ఇచ్చుకుంటూ, ఇప్పుడు చిత్తూరుకు కూడా తీసుకుంటున్నారు. ఈ కాలవ పేరే తెలుగుగంగ.

ఈ 29.8 టి.యం.సిలు ఎక్కడి నుంచి వస్తాయి? అవి నికర జలాలలో భాగం కాదు. నికర జలాల పంపకం అయిపోయింది. ఆ పంపకాలలో నుంచే 15 టి.యం.సి.లు మద్రాసుకు పోతున్నాయి. 29.8 టి.యం.సిలు ఎక్స్‌ట్రా తీసుకుంది ఎక్కడి నుంచి? అవి మిగులు జలాలు అయి ఉండాలి. అంటే ఏ సంవత్సరమైనా 2060 టి.యం.సిల కంటే ఎక్కువ ఉంటే ఈ 29.8 టి.యం.సిలు వస్తాయి లేకపోతే రావు.కానీ బచావత్ అవార్డు ఈ మిగులు జలాల గురించి ఏం చెప్పిందంటే నికర జలాలకు మాత్రమే ప్రాజెక్టులు పరిమితం కావాలి అని. ఆ పైన నీళ్ళు ఏవైనా వస్తే కట్టిన ప్రాజెక్టుల ద్వారా వాడుకోవచ్చు తప్ప, కొత్తగా ప్రాజెక్టులు కట్టడానికి వీలులేదు అని. ఒక పంటకు ఇచ్చే చోట కావాలంటే రెండో పంటకు ఇవ్వు. లేకపోతే కొంచెం ఇచ్చే చోట ఎక్కువ ఇవ్వు. ఇరిగేటెడ్ డ్రైకి ఇచ్చే చోట మాగాణికివ్వు. అంతే తప్ప మిగులు జలాల మీద ప్రాజెక్టు కట్టుకోవడానికి వీలు లేదనేది బచావత్ ట్రిబ్యునల్ అవార్డులో ఒక ముఖ్యమైన అంశం. దానిని మొట్టమొదట అతిక్రమించింది మనమే. ఇప్పుడు బాబ్లీ అనీ, అంతకు ముందు ఆల్మట్టి అని గొడవ చేస్తూ ఉన్నాం కానీ మొట్టమొదట మొదలు పెట్టింది మనమే. మిగులు జలాల మీద హక్కు కల్పించుకుంటూ ప్రాజెక్టు కట్టడమనేది ఆంధ్రప్రదేశే మొదలు పెట్టింది. దానికి ఆనాడు ఎన్.టి.రామారావు పైన భారీ ఒత్తిడి పెట్టింది ఎవరంటే రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మైసూరారెడ్డి వీళ్ళే. ప్రధానంగా కడప జిల్లా నాయకులు. వీళ్ళే ఒత్తిడి పెట్టి చేయించారు.

ఆల్మట్టి గురించి మనం సుప్రీంకోర్టుకు పోతే వెంటనే వాళ్ళు ఏమడుగుతారు? తెలుగు గంగ ఎప్పుడు కట్టారు? ఎట్లా కట్టారు? ఇవన్నీ అడుగుతారు కదా, ఊరుకోరు కదా! ఇవ్వాళ మనం బాబ్లీ గురించి మాట్లాడితే తెలుగుగంగ గురించి వాళ్ళూ మాట్లాడతారు– మీరు ఎట్లా కట్టారు తెలుగుగంగ ప్రాజెక్టు అని. నేను అందుకే అన్నా, రాయలసీమకు నీళ్ళు అవసరం, ఎవ్వరూ కాదనరు, తెలంగాణకైనా, రాయలసీమకైనా నీళ్ళు చాలా అవసరం. వాటిని పొందడానికి ఒక పద్ధతి పాటిస్తే ఎదుటి వాళ్ళు గౌరవిస్తారు. మనం పద్ధతికి లోబడి ఉన్నాం కాబట్టి ఎదుటి వాళ్ళు కూడా పద్ధతి ప్రకారమే పోవలసి ఉంటుంది. నువ్వు భిన్నంగా పోతే ఏమవుతుందంటే ఎదుటి వాళ్ళు గౌరవించడం మానేస్తారు. తరువాత Chaos మాత్రమే మిగులుతుంది. ఏ రకమైన నియమాలు ఉండవు. దీన్ని కడప జిల్లా నాయకులకు వివరించి చెప్పటం సాధ్యం కాదు, వాళ్ళకు అర్థం కాదు. వాళ్ళ కల్చరే వేరు. అవకాశం ఉంటే చేసుకుంటాం అనేది తప్ప పద్ధతీ, చట్టమూ, నియమమూ, నీతీ అవన్నీ వాళ్ళ దృష్టికి రావు. ఇవన్నీ జరిగాక కూడా వెనుకబడిన ప్రాంతాలు ఇంకా చాలా అట్లాగే ఉండిపోయినాయి.

దాంతో సహజంగానే మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల నుంచి డిమాండ్ వచ్చింది. నదికి అటువైపున రాయలసీమ అయితే ఇటువైపు తెలంగాణ. రాజకీయాలలో భాగంగా తెలంగాణ, రాయలసీమ అని చర్చిస్తున్నాం కానీ నైసర్గికంగా చూస్తే గోదావరి బేసిన్, కృష్ణా బేసిన్ అనేది సహజమైనటువంటి విభజన. కృష్ణా బేసిన్‌లోకి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి కాక రాయలసీమలో కొంత భాగం వస్తుంది. రాయలసీమలోని మిగిలిన భాగం మొత్తం పెన్నా బేసిన్‌లో ఉంది.కానీ పెన్నా నదిలో నీళ్ళు చాలా తక్కువ కాబట్టి రాయలసీమ వాళ్ళు ఎప్పుడూ కూడా కృష్ణానది నుంచి నీళ్ళు తీసుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. వేరే మార్గం లేదు కూడా. అనుసరించే పద్ధతుల పట్ల కోపమే తప్ప తీసుకోవడానికి వీలులేదు అంటే క్షామమూ, చావులూ తప్ప ఏమీ ఉండవు రాయలసీమలో. అందుకనే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు అంటే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రరాష్ట్రం వేరు కావాలనే డిమాండ్ వచ్చినపుడు రాయలసీమ వాళ్ళకు చాలా అనుమానం ఉండింది. ఎందుకంటే అంతకుముందు బ్రిటిషువాళ్ళు ఏం చేశారంటే కృష్ణానదిపైన రాయలసీమ ప్రాంతంలో పెద్ద డ్యాం కట్టి వాళ్ళకు నీళ్ళిచ్చుకుంటూ తమిళనాడుకు నీళ్ళు తీసుకుపోవాలనే ఆలోచన చేశారు. తమిళనాడు వాస్తవానికి మనకంటే వర్షాభావ రాష్ట్రం. ఒక్క తంజావూరు దగ్గరున్న కావేరి డెల్టా తప్ప మిగతా రాష్ట్రం అంతా చాలా వెనుకబడి ఉంటుంది. ఇతరత్రా వాళ్ళు – ముఖ్యంగా ఇండస్ట్రియల్‌గా – చాలా డెవలప్ అయ్యారు. అది వేరే విషయం. వాళ్ళకున్నటువంటి అడ్మినిస్ట్రేటివ్ యోగ్యత వల్ల వాళ్ళు బాగుపడ్డారే కానీ వర్షం రీత్యా చూస్తే చాలా వర్షాభావం ఉన్న రాష్ట్రం తమిళనాడు. అప్పటి మద్రాసు రాష్ట్రం ఏమి ఆలోచన చేసిందంటే రాయలసీమలో ఎక్కడో ఒక చోట పెద్ద డ్యాం ఒకటి కట్టి రాయలసీమకు కొంత ఇస్తూ తమిళనాడుకు ఎక్కువ నీళ్ళు తీసుకెళ్ళాలని. మద్రాసు రాష్ట్రంలో ఉంటేనే ఆ నీళ్ళు మాకు వస్తాయి. ఆంధ్రులతో కలిస్తే, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే మాకు అవి ఇవ్వరు అన్నటువంటి సందేహం ఆ రోజు రాయలసీమ నాయకులలో ఉండింది. కాబట్టే వాళ్ళు ఒత్తిడి పెట్టారు. కృష్ణానది జలాలలో రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తేనే ప్రత్యేక ఆంధ్రా రాష్ట్రానికి మేము ఒప్పుకుంటాం, లేకపోతే ఒప్పుకోమని వాళ్ళు అప్పుడు గొడవ పెట్టారు. అప్పుడు కుదిరిన ఒప్పందాన్నే శ్రీబాగ్ ఒడంబడిక అంటారు. శ్రీబాగ్ అనేది ఒక నాయకుడి ఇల్లు. ఆ ఇంటి పేరు అది. అక్కడ ఒక అగ్రిమెంట్‌లా జరిగింది. ఆంధ్రా ప్రాంత నాయకులు అంటే సర్కారు జిల్లాల నాయకులు, కృష్ణానది

జలాల వినియోగంలో రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు వారిని ఒప్పించడం జరిగింది.

మళ్ళీ 1956లో తెలంగాణ వాళ్ళూ అదే అడిగారు. ఆంధ్ర నాయకులు మళ్ళీ అదే హామీ ఇచ్చారు. రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని వాళ్ళకు 1953లో హామీ ఇచ్చి, మీకే మొదటి ప్రాధాన్యం ఇస్తామని 1956లో తెలంగాణ వాళ్ళకు చెప్పి చివరికి ఇద్దరికీ ఇవ్వకుండా సర్కారు జిల్లాలకు నీళ్ళు వాడుకోవడం కొనసాగించారన్నది వాస్తవం.

## తామరతంపరగా కొత్త ప్రాజెక్టులు

మళ్ళీ మిగులు జలాల దగ్గరికి వస్తే, మిగులు జలాల మీద తెలుగుగంగ ఎలాగూ ప్రారంభించావు కదా, ప్రారంభించాక ఇంక సమస్య ఏముంది అనుకున్నారు. మరిన్ని ప్రాజెక్టులు కట్టాలి అనే డిమాండ్ క్రమంగా పెరగడం మొదలైంది. ఆయా జిల్లాలలో ఆయా నియోజకవర్గ నాయకులు ఎవరో ఒకరు ఒక ఇంజనీరును పట్టుకోవడం, ఒక స్కీము తయారు చేయించడం, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకురావడం... ఇలా జరుగుతూ పోయింది. దాంతో రకరకాల ప్రాజెక్టులు చర్చకు వచ్చాయి. ఈ 40 టి.యం.సిలు దీనికి కేటాయిస్తాం, ఇన్ని ఎకరాలు ఇక్కడ సాగు అవుతాయి, ఇంకో 40 టి.యం.సిలు అక్కడ కేటాయిస్తాం, అక్కడ ఇన్ని ఎకరాలు సాగవుతాయి అంటూ రకరకాల హామీలు ఇచ్చుకుంటూ వచ్చారు. ఇటు తెలంగాణలో, అటు రాయలసీమలో కూడా హామీలు ఇచ్చుకుంటూ వచ్చారు. అవన్నీ హామీలుగానే ఉండిపోయాయి చాలా కాలం పాటు. ఒక్కొక్క దానికి పలుమార్లు పునాది రాళ్ళు కూడా వేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువకు, హంద్రీ– నీవాకు వేసిన పునాది రాళ్ళకయితే లెక్కే లేదు, అన్ని పునాది రాళ్ళు వేశారు. సరే పునాది రాళ్ళే కదా వేసుకుంటే వేసుకున్నారులే అని చెప్పి కర్ణాటక, మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదు.

రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఏం చేశాడంటే పునాదిరాళ్ళు వేసినటువంటి మిగులు జలాల ప్రాజెక్టులన్నిటినీ కట్టడం మొదలు పెట్టాడు. అవి తెలుగుగంగ కాక ఏడు ఉన్నాయి. వాటన్నిటికి నీళ్ళు ఇవ్వాలంటే కర్ణాటక, మహారాష్ట్రలకు పూర్తిగా మానేసి మనమే తీసుకోవాలి కృష్ణానది నీళ్ళన్నీ. ఆ ఎనిమిది ప్రాజెక్టులు ఏమిటీ అంటే మహబూబ్‌నగర్‌కు రెండు– నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. భీమా ఏమో అంతకు ముందే ఆదా చేశాము నీళ్ళు అని చెప్పి తెచ్చుకున్న ప్రాజెక్టు. అనుమతి తెచ్చుకుంది 1980లలో అయితే 2008లో మొదలుపెట్టారు దానిని కట్టడం. కోపాలు వస్తాయంటే రాకుండా ఉంటాయా? అదే

రాయలసీమకు నీళ్ళు తీసుకెళ్ళే శ్రీశైలం కుడిగట్టుకాలువ మాత్రం దాదాపుగా పూర్తి అయిపోయింది. నాలుగైదు సంవత్సరాలలో పూర్తి చేసుకున్నారు దానిని. భీమా నిజానికి నికర జలాల ప్రాజెక్టే. అయినా తెలుగుగంగ తరువాతే మొదలుపెట్టారు దానిని. నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు కాక నల్గొండ జిల్లాకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ అనే ప్రాజెక్టు ఒకటి, నాగార్జున సాగర్ దగ్గర ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ అనే ప్రాజెక్టు ఇంకొకటి కట్టడం మొదలుపెట్టారు. ఇవి నాలుగూ తెలంగాణకు.

రాయలసీమకూ ఇంకో రెండున్నాయి. అన్నీ శ్రీశైలం నుంచే మొదలవుతాయి. రాయలసీమకు నీళ్ళు ఇవ్వాలంటే వేరే మార్గమేమీ లేదు. ఒకటి హంద్రీ- నీవా ప్రాజెక్టు. ఇది కర్నూలు మీదుగా అనంతపురం జిల్లాకు నీళ్ళు తీసికెళ్ళే ప్రాజెక్టు. ఇంకొకటి గండికోట లేక గాలేరు- నగరి. కడప జిల్లాకు పోతుంది. తెలుగుగంగ ముందే ఉంది. కాబట్టి తెలుగుగంగ, హంద్రీ- నీవా, గండికోట లేక గాలేరు- నగరి మొత్తం మూడు అయ్యాయి. అవి మూడూ రాయలసీమకు అయితే ఇంకొకటి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, కంభం ప్రాంతాలకు నీళ్ళు తీసుకెళ్ళే వెలిగొండ ప్రాజెక్టు. ఈ ప్రాంతం బాగా వెనుకబడినటువంటి కరువు ప్రాంతం. అంటే మిగులు జలాల మీద మొత్తం ఎనిమిది ప్రాజెక్టులు. ఒక్కొక్క దానికి నలభై, నలభై అయిదు, యాభై టి.యం.సిలు..... స్థానిక ఎమ్మెల్యే ఇష్టం, ఎంతైనా ప్రామిస్ చేస్తాడు. అతనికేమీ ఇబ్బంది లేదు. వాటన్నిటినీ పూర్తి చేయాలంటే 300, 350 టి.యం.సిల నీళ్ళు కావాలి. మనకేమో చుక్క లేదు. మనకిచ్చిన 800 టి.యం.సిలు అయిపోయినాయి కదా. అయినా ఈ ప్రాజెక్టులన్నీ కడుతున్నారు. మేము మొదటినుంచి చెపుతున్నది ఏమిటంటే, అన్నీ కరువు ప్రాంతాలే, నీళ్ళు కావాల్సిన ప్రాంతాలే, ఇవ్వడం అవసరమే, కాని సవ్యమైన మార్గం అనుసరించు అని.

## బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్

2004 సంవత్సరంలో రెండవ ట్రిబ్యునల్ ఏర్పడింది, ఆ ట్రిబ్యునల్ ముందుకుపోయి మిగులు జలాలకు కూడా మాకు హక్కులు కల్పించండి అనో, మిగులు జలాలకు కూడా ప్రాజెక్టులు కట్టుకొనే అవకాశం మాకు కల్పించండి అనో అడగాలి కదా. అటువంటి ప్రతిపాదనలు పెట్టకుండా నువ్వు బచావత్ అవార్డుకు వ్యతిరేకంగా ఇంత భారీగా 8 ప్రాజెక్టులు కట్టుకుంటూ పోతే రేపు కర్ణాటకనైనా, మహారాష్ట్రనైనా ఏమని ప్రశ్నిస్తావు నువ్వు? రెండవది రైతులను ఎంత మోసం చేస్తున్నావు నువ్వు? ప్రాజెక్టులు కట్టినప్పుడు నీళ్ళొస్తాయని చెప్పి ఆశపడతారు కదా! కాని ఇవి మిగులు జలాల ప్రాజెక్టులు, ఎప్పుడు నిండుతాయో తెలియదు. వరుణ దేవుడు నా పార్టీలో

చేరాడు అని రాజశేఖరరెడ్డి అనుకోవచ్చు కానీ ఆయన కాంగ్రెస్ పార్టీలో పర్మనెంట్‌గా ఉండేటట్టు కనపడ్డం లేదు. రాజీనామా చేసినట్టున్నాడు. అప్పుడేమి చెయ్యాలి? ఇవన్నీ ప్రశ్నలే.... అయినా కట్టుకొంటూ పోతున్నాడు. కామన్‌గా పత్రికలలో వచ్చే వ్యాఖ్యలైనా, మేము చేసేదైనా ఏమిటంటే ఈ ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల కోసమేగానీ రైతుల కోసం కాదు. కాలువలు అద్భుతంగా తవ్వేస్తున్నారు. ఇవన్నీ ఎక్కువగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కాబట్టి పెద్ద డ్యాం కట్టేది ఏముండదు, చిన్న సంప్ లాంటిది క్రియేట్ చేస్తారు. లిఫ్ట్ చేసుకుంటూ పోతారు. భారీ ప్రాజెక్టులు కావు కాబట్టి ముంపు కూడా ఎక్కువేమీ ఉండదు. కాలువలే ప్రధానమైన కన్‌స్ట్రక్షన్ కాబట్టి కాంట్రాక్టర్లకు ఆదాయాలు అద్భుతంగా వస్తాయి. రాజశేఖరరెడ్డి వచ్చిన తరువాత మీరు రాష్ట్రంలో ఎక్కడికి పోండి కాంట్రాక్టర్లు కడప జిల్లా వాళ్ళే, వేరే ఎవ్వరూ లేరు. మీరు తెలంగాణ మారుమూల ప్రాంతానికైనా పోండి– అక్కడా వాళ్ళే. మంచిర్యాల దగ్గర చిన్న వాగు, ర్యాలీ వాగు అని, ఆ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రమాదం జరిగి 12 మంది కూలీలు చనిపోయారని తెలిసి మేము పోయినప్పుడు దాని సబ్ కాంట్రాక్టర్లు ఇద్దరూ కడప జిల్లా వాళ్ళే అని తెలిసింది.

2000 సంవత్సరంలో బచావత్ అవార్డు టైమ్ అయిపోయినపుడు కర్ణాటక మన మీద ఫిర్యాదు చేసింది. అప్పటికి ఇంకా రాజశేఖర్‌రెడ్డి హయాం మొదలు కాలేదు కానీ, చంద్రబాబు నాయుడు నాగార్జునసాగర్ మీద ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును మొదలుపెట్టాడు. బచావత్ అవార్డుకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలతో ప్రాజెక్టు కట్టేసుకుంటున్నదని కర్ణాటక ఫిర్యాదు చేస్తే కేంద్ర ప్రభుత్వం మళ్ళీ ఒక ట్రిబ్యునల్‌ను నియమించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి బ్రిజేశ్ కుమార్‌ను ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా నియమించింది. కర్ణాటక మొట్టమొదట వేసిన అప్లికేషన్ ఏమిటీ అంటే ఈ ఎనిమిది ప్రాజెక్టులనూ ఆపమని ఆదేశం ఇవ్వండీ అని. కారణం "Because it is contradictory to Bachawat Award". ఏం చెప్పారు మనవాళ్లు? ఆ 8 ప్రాజెక్టులకూ మేము నీటి హక్కులు అడగము, ఉంటే తీసుకొంటాము లేకపోతే లేదు అని చెప్పారు. దాంతో ట్రిబ్యునల్ కర్ణాటక అప్లికేషన్‌ను డిస్మిస్ చేసింది. మన పేపర్లో వార్త ఏమొచ్చింది? కర్ణాటక వాళ్ళ అభ్యర్ధనను తోసిపుచ్చిన బ్రిజేశ్‌కుమార్ కమిషన్ అని. ఏమి తోసిపుచ్చింది అనంటే ఆంధ్రప్రదేశ్ 'అక్రమంగా కట్టుకుంటున్న ప్రాజెక్టులు ఆపండీ' అని వాళ్ళంటే మనవాళ్ళు 'మేము హక్కులు అడగం కదా ఎందుకు ఆపాలి' అన్నారు. దానితో డిస్మిస్ చేశారు. 'లా'లో దీన్ని infructuous application అంటారు. హక్కులు అడగని విషయం కాబట్టి, అందులో చట్టం నిర్ణయించాల్సిన అంశమేదీ లేదు కాబట్టి దాన్ని డిస్మిస్ చేశారు బ్రిజేశ్ కుమార్‌గారు. దీన్ని పట్టుకుని

'కర్ణాటక వాళ్ళ అభ్యర్థనను తోసిపుచ్చిన రెండవ కృష్ణా ట్రిబ్యునల్' అని పేపర్లో వార్తలు రాసుకున్నాం మనం.

ఇవ్వాళ పరిస్థితి ఏమిటి? ఈ ట్రిబ్యునల్ అవార్డు ముప్ఫై ఏళ్ళో నలభై ఏళ్ళో అమలులో ఉంటుంది. అంటే కరువు ప్రాంతాల కోసం తాము కడుతున్న ప్రాజెక్టులకు ముప్ఫై, నలభై ఏళ్ళ వరకు ఎలాంటి నీటి హక్కులుండవు అని ఒప్పుకొని వచ్చాడు రాజశేఖరరెడ్డి. దురదృష్టం ఏమిటంటే ఈ ఎనిమిది ప్రాజెక్టులలో నాలుగు తెలంగాణలో, మూడు రాయలసీమలో, ఒకటి ఆంధ్రాలో ఉన్నా, ప్రాంతీయ వైషమ్యాలు ఎంతగా ఉన్నాయంటే ఈ మూడు ప్రాంతాలలో ఏ ఒక్కటీ దీని గురించి మాట్లాడడం లేదు. వీళ్ళందరూ ఒకటిగా ఉండి ఉంటే ఈ ఎనిమిది ప్రాజెక్టుల ఆయకట్టుదారులు – అంటే ఈ ఎనిమిది ప్రాజెక్టుల ద్వారా నీళ్ళు పొందబోయే రైతాంగం అంతా కూడా ముందుకు వచ్చి ఆందోళన చేయగలిగి ఉండేది. ఎవ్వరూ మాట్లడకపోవడం వల్ల రాజశేఖరరెడ్డి గారే దానిని అవార్డు చేసి వెనక్కి రాగలిగారు.

## పునఃపంపిణీ ఒక్కటే పరిష్కారం

మరైతే ఏం చేయాలి అన్న ప్రశ్న వస్తుంది. నికర జలాలు లేవని మీరే అంటున్నారు, ఇవి కరువు ప్రాంతాలని కూడా మీరే అంటున్నారు, ఆయన ఏదో ఒక రకంగా మిగులు జలాల పేరు మీద ప్రాజెక్టులు కట్టేసి అప్పుడప్పుడైనా నీళ్ళు ఇస్తానంటే అదీ వద్దంటున్నారు, అనవసరంగా ఖర్చు అంటున్నారు, మరేం చేయాలి అని మమ్మల్ని మీరు ఒక ప్రశ్న వేయవచ్చు. దీనికి మేము మొదటి నుంచి చెప్తున్న జవాబు ఏమిటంటే, ఇంతవరకు నేను వాస్తవాలు చెప్పుకుంటూ వచ్చాను, ఇక్కడ మా మానవ హక్కుల వేదిక తరఫు నుంచి మేము చెప్తున్న జవాబు ఏమిటీ అనంటే నీటి హక్కుల్ని పునః పంపిణీ చేద్దాం. అది ఏ రకంగా చెయ్యాలనేది మళ్ళా చెపుతాను. మనకొచ్చిన 800 టి.యం.సిల కేటాయింపు ఇవ్వాళ ఏ రకంగా హక్కులుగా వాడుకోబడుతున్నాయో, అంటే కృష్ణాడెల్టాకు ఇంత, నాగార్జునసాగర్‌కు ఇంత.... అలా ఆ కేటాయింపును పునః పంపిణీ చేస్తే ఒక 200 టి.యం.సిలను మిగిలించవచ్చు. ఆ 200 టి.యం.సిలతో ఈ ఎనిమిది ప్రాజెక్టులకు 25,30 టి.యం.సిల చొప్పున నీళ్ళు ఇచ్చినా కూడా ఉపయోగమే. ఒక లక్షా యాభైవేల ఎకరాలకో, 2 లక్షల ఎకరాలకో ఆరుతడి పంటకైనా నీళ్ళొస్తాయి. ఆ మేరకైనా నీళ్ళుంటాయి. తాగు నీటికైనా వస్తాయి. ఇదీ మా ప్రతిపాదన.

## నీళ్ళ బదిలీకి వై.ఎస్.వ్యూహం

రాజశేఖరరెడ్డి గారి ఆలోచన ఏమిటీ అనంటే గోదావరి నుంచి నీళ్ళు తీసుకుని కృష్ణాకు మళ్ళిద్దామని. అందుకే కృష్ణా ట్రిబ్యునల్ దగ్గరకు పోయి మేము నీటి హక్కులు

అడగము అని చెప్పేసి, కర్ణాటక వాళ్ళ అభ్యంతరాన్ని డిస్మిస్ చేయించుకొని వెనక్కొచ్చి, గోదావరిలో నుంచి నీళ్ళు తీసుకొచ్చి కృష్ణాలో పోస్తాము, దానిని వాడుకొంటాము అని చెబుతున్నాడు. ఇది చాలా తెలివైన పని అని ఆయన భావిస్తున్నాడు. పోలవరం డ్యాం నుంచి 80 టి.యం.సిల నీళ్ళు ప్రకాశం బ్యారేజీకి తరలించాలని ఆయన ఆలోచన. పోలవరం నుంచి 80 టి.యం.సిలు, దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్ కిందకి మరో 100 టి.యం.సిలు, మొత్తం 180 టి.యం.సిల నీళ్ళను గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌కు బదిలీ చేస్తే ఆ 180 టి.యం.సిలను కొత్తగా కట్టబోయే ఈ ప్రాజెక్టులకు వాడుకోవచ్చు అనేది రాజశేఖరరెడ్డి గారి ఆలోచన. ఆ ప్రకారమే పోలవరం డ్యాం కట్టేస్తున్నారు. మొండిగా ఉన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు కట్టేది ఈ 100 టి.యం.సిలు ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి, ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వడానికి. ఖమ్మం జిల్లాలో నీళ్ళు ఇవ్వడానికి ఏర్పాట్లు ఏమీ మొదలవలేదు గానీ, ఈ ట్రాన్స్‌ఫర్‌కు మాత్రం ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. టిఆర్ఎస్ వాళ్ళకు కోపం వస్తుందంటే ఊరికే రావడం లేదు. వాళ్ళ అభ్యంతరం ఏమిటి? ఆ నీళ్ళను కృష్ణా బేసిన్‌కు తరలిస్తారని. సరే టిఆర్ఎస్ రాజకీయాలలో భాగంగా కృష్ణా బేసిన్‌కు తరలింపు రాయలసీమకు ఇవ్వడానికే అంటారు కానీ రాయలసీమకే కాదు, దక్షిణ తెలంగాణకు కూడా వస్తుంది అది.

మీకు అనుమానం రావచ్చు. నాగార్జునసాగర్ కింద కృష్ణానదిలో కలవబోయే నీళ్ళు నది పైకి ఎలా పోతాయి? రాయలసీమకు, మహబూబ్‌నగర్‌కు, నల్గొండకు ఎలా ఇవ్వగలుగుతారని. ఎట్లా పోతాయో చూద్దాం. మన వాళ్ళకు ఈ ఆలోచన వస్తుందని కర్ణాటకకు, మహారాష్ట్రకు ముందే అనుమానం ఉంది. ఆంధ్రావాళ్ళు తెలివైన వాళ్ళు, ఇప్పుడు మీ దగ్గర కన్నీళ్ళు పెట్టుకొని మాకు జూరాలకివ్వండి, మాకు అనంతపురానికియ్యండి అని అడుగుతున్నారు కాని ఎప్పుడో ఒకప్పుడు గోదావరి నీళ్ళను కృష్ణానదిలోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యబోతారు అని ఆ రోజే కర్ణాటక మహారాష్ట్రలు అన్నాయి. అందుకే బచావత్ తన అవార్డులో ఒక పేరా రాశాడు. ఏమనంటే "If at any time in the future Andhra Pradesh transfers water from the Godavari Basin to the Krishna Basin that water becomes part of the Krishna Basin. Therefore, both Karnataka and Maharashtra will also have a right to that water. అర్థమైంది కదా. ఎప్పుడైనా భవిష్యత్తులో గోదావరి నుంచి నీళ్ళు కృష్ణాకి గాని బదలాయిస్తే అవి కృష్ణా బేసిన్ నీళ్ళు అయిపోతాయి. అప్పుడవి ఈ పంపకంలో భాగం అవుతాయి. ఏ దామాషాలో అయితే 800, 700, 560 టి.యం.సిలను పంచారో అదే దామాషాలో ఆ నీళ్ళను కూడా పంచుకోవాలి. దాని

అర్థం ఏమిటి? ఈ 180 టి.యం.సిలలో 100 టి.యం.సిలు మనకు ఉంటాయి. మిగతా 80 టి.యం.సిలు వాళ్ళకు పోతాయి. ఎలా పోతాయి? ఇక్కడ నుంచి పైకి ట్యాంకర్లలో పోవు కదా అంటారేమో. వాళ్ళు పైన ఆపుకుంటారు.

ఆంధ్రా ప్రాంతాన్ని ఏమన్నా అంటే చాలామందికి కోపాలు వస్తాయి కానీ కృష్ణా డెల్టా మొత్తం వాడకం 180 టి.యం.సిలు. గోదావరి బేసిన్ నుంచి ఎంత ట్రాన్స్ఫర్ కానున్నాయో కరెక్టుగా అంతే. తెలంగాణ, రాయలసీమలకు నీళ్ళిచ్చే పేరు మీద ఏం చేస్తున్నారు అంటే కృష్ణా నది కంటే ఎప్పుడూ ఎక్కువ నీళ్ళుండే గోదావరి నుంచి కరెక్టుగా 180 టి.యం.సిలు కృష్ణాకు ట్రాన్స్ఫర్ చేస్తున్నారు. కృష్ణాలో నీళ్ళు ఉన్నా లేకపోయినా,  డెల్టాకు కావాల్సిన నీళ్ళు తప్పనిసరిగా గోదావరి నుంచి ట్రాన్స్ఫర్ అయివస్తాయి. అప్పుడు కృష్ణానది నీళ్ళను ఆ మేరకు పైనే ఆపుకోవచ్చు. నెట్టెంపాడు దగ్గర తీసుకోవచ్చు, కల్వకుర్తి దగ్గర తీసుకోవచ్చు, శ్రీశైలం దగ్గర ఆపేసుకోవచ్చు. సాగర్‌లో కూడా నిల్వ చేసుకోవచ్చు. ఆ విధంగా నల్లగొండకు, మహబూబ్‌నగర్‌కు, అనంతపురానికి, కర్నూలుకు ఇచ్చుకోవచ్చు అనేది ఆలోచన. కానీ దానిలో 80 టి.యం.సిలు కర్ణాటక, మహారాష్ట్రలకు పోతాయి కదా! కర్ణాటక వాడెక్కడాపుకుంటాడు? కరెక్టుగా జూరాలకు, భీమాకు పైన ఆపుకుంటాడు. టి.బి డ్యాం పైన ఆపుకుంటాడు. వర్షం బాగా ఉన్న సంవత్సరం సమస్య ఉండదు. ఎందుకంటే ఇంతకుముందే చెప్పాను కృష్ణానదిలోకి మనకు కర్ణాటక నుంచి 200 టి.యం.సిలు నీళ్ళు వస్తాయి. ఈ 80 టి.యం.సిలు వాళ్ళు ఆపుకున్నా మనకొచ్చేవి వస్తాయి. వర్షాభావం ఉన్న సంవత్సరాలలో మాత్రం ఈ 80 టి.యం.సిలు వాళ్ళు ఆపుకుంటే మహబూబ్‌నగర్‌కు నీళ్ళిచ్చే భీమా, జూరాల, అనంతపురానికి నీళ్ళిచ్చే టి.బి. డ్యాం ఇవన్నీ దెబ్బతింటాయి. అంటే ఈ ట్రాన్స్ఫర్ వల్ల జరగబోయేది ఏమిటంటే వర్షాభావ సంవత్సరంలో మహబూబ్‌నగర్, అనంతపురం, కర్నూలు జిల్లాలకు వచ్చే నీటి మీద దెబ్బ పడుతుంది– రాజశేఖరరెడ్డి గారు చేస్తున్నటువంటి ఈ పని వలన.

## గోదావరి మీద రెండే రెండు

గోదావరి సంగతి ఇంకా చెప్పుకోలేదు మనం. గోదావరిలో 1480 టి.యం.సిలు మన వాటాగా వచ్చాయని చెప్పాం కదా. ఆ 1480 టి.యం.సిలలో అప్పుడెప్పుడో బ్రిటిషువాడు ధవళేశ్వరం దగ్గర కట్టినటువంటి ఒక ఆనకట్ట, ఆ తరువాత శ్రీరాంసాగర్– ఇది దాదాపుగా మన రాష్ట్రంలోకి గోదావరి ప్రవేశించే మొదట్లో ఉంటుంది – తప్ప మనం గోదావరిపై మరేమీ కట్టుకోలేదు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం– తెలంగాణలో మొత్తం 5 జిల్లాలు దాటి వస్తుంది

అది. అయినా ఒక్క ప్రాజెక్టు కట్టలేదు ఇన్ని సంవత్సరాలలో. తెలంగాణ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చి 1956లో తెలంగాణను కలుపుకొని కూడా ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. శ్రీరాంసాగర్‌ను కూడా నిజాం ప్రభుత్వం ఎంతమేరకు ప్లాన్ చేసిందో అంత మేరకు కట్టలేదు కానీ 10 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు దాని కింద ఉంది. ఇవ్వాళ కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే 'వన్ ఆఫ్ ది డెవలప్డ్ డిస్ట్రిక్ట్స్‌గా ఉంది అంటే శ్రీరాంసాగర్ వల్లనే. గోదావరిలోని మిగతా నీళ్ళను కూడా వాడుకొని ఉంటే కరీంనగర్‌లాగే వరంగల్ బాగుపడేది, ఆదిలాబాద్ బాగుపడేది, మరికొన్ని జిల్లాలు కూడా బాగుపడేవి. కోపం రాకుండా ఎందుకుంటుంది ఎవరికైనా? ఎందుకు చెయ్యలేదు అన్న ప్రశ్నకు జవాబు ఏమిటి? శ్రద్ధ లేదు కాబట్టి. ఎందుకు శ్రద్ధ లేదు? ఆ ప్రాంతమంటే వివక్ష కాబట్టి. ఆటోమేటిక్‌గా రావా ఈ జవాబులు. వస్తాయి కదా. శ్రీరాంసాగర్, ధవళేశ్వరం కాక చిన్నచిన్నవి కొన్ని ఉన్నాయనుకోండి. ఉదాహరణకు మానేరు మీద అప్పర్ మానేరు డ్యాం, లోయర్ మానేరు డ్యాం. మంజీరా మీద సింగూరు, మంజీరా, నిజాంసాగర్. కాని సింగూరు, మంజీరా హైద్రాబాదుకు నీళ్ళు ఇవ్వటానికి సరిపోతాయి, రైతులకేమీ రావు. అప్పర్ మానేరు డ్యాంలో నీళ్ళు ఎప్పుడూ ఉండవు. మంచి ఫుట్‌బాల్ ఫీల్డ్‌లా ఉంటుంది. లోయర్ మానేరు డ్యాం కరీంనగర్ టౌన్‌కు నీళ్ళు ఇస్తుందంతే. అంతకంటే ఏమీ ఇవ్వదు.

## పోలవరం నీళ్ళు ఎవరికోసం?

ఆ ప్రాజెక్టులకు పోను ఆ 1480 టి.యం.సి.లలో వాడకుండా మిగిలి ఉంది 680 టి.యం.సి.లు. ఎక్కువే గదా అవి. దాంట్లో ఇవ్వాళ 335 టి.యం.సి.లు పోలవరానికి కేటాయించారు. కాని పోలవరం తెలంగాణ వాళ్ళకు చుక్క నీరు ఇవ్వదు. మొత్తం 9 ముంపు మండలాలూ ఆదివాసీ మండలాలే. అందులో ఏడు మండలాలు తెలంగాణలోనే ఉన్నాయి. అవన్నీ మునగనున్నాయి. పోలవరంకు కేటాయించిన 335 టి.యం.సి.లలో 80 టి.యం.సి.లు కృష్ణా నదిలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. మిగిలినవి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సాగునీటి సదుపాయం లేని మెట్ట ప్రాంతానికి సాగునీరు ఇస్తాయి. అది పోలవరం కుడికాలువ. పోలవరం ఎడమ కాలువ తూర్పు గోదావరి జిల్లాలోని తుని నుంచి విశాఖపట్నం దాకా మంచి నీళ్ళు ఇచ్చుకుంటూ వెళుతుందనుకున్నాం. కానీ ఎడమ కాలువ అది కూడ చెయ్యదని ఇవ్వాళ అర్థం అవుతుంది. అది రాంబిల్లి, అచ్చుతాపురం సెజ్‌లకు నీళ్ళిస్తుంది, కాకినాడ సెజ్‌కు నీళ్ళిస్తుంది, కోస్టల్ కారిడార్‌కు నీళ్ళిస్తుంది తప్ప విశాఖపట్నానికి ఏమీ ఇవ్వదు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలలో కుడికాలువ ఏం చేస్తుందో మనకు చూస్తే తప్ప తెలియదు. తెలంగాణవాదుల కోపం

ఏమిటంటే మిగిలిన 680 టి.యం.సిలలో 335 టి.యం.సిలు పోలవరానికి పోతున్నాయి, దుమ్ముగూడెం నుంచి మరో 100 టి.యం.సిలు కృష్ణా డెల్టాకు పోతున్నాయి. చివరికి 245 టి.యం.సిలు మాత్రమే తెలంగాణ జిల్లాల అవసరాలకు మిగిలాయి. ఇది న్యాయం కాదని సహజంగానే వాళ్ళకు ఆందోళన, ఆగ్రహం కలుగుతాయి కదా. ఒక రకంగా చెప్పాలంటే ఉత్తర తెలంగాణ జిల్లాల నీటి అవసరాలను తాకట్టు పెట్టి 180 టి.యం.సి.లు తీసుకొచ్చి కృష్ణా డెల్టాకు గ్యారంటీ కల్పించి, పై వాళ్ళు 80 టి.యం.సిలు ఏ రోజైనా ఆపేసుకోవచ్చు అన్న పరిస్థితి కల్పించి మళ్ళీ తెలంగాణకు, రాయలసీమకు నష్టం చేస్తున్నావు. మహబూబ్‌నగర్‌కు, అనంతపురానికి, కర్నూలుకు నష్టం చేసేటటువంటి ఆలోచన ఇది. ఇది ఎంతవరకు సమంజసమైనటువంటి ఆలోచన?

## మా వాదన

మేము దాని బదులు చెబుతున్నది ఏమిటంటే నదీ జలాల పునఃపంపిణీ జరగాలని. 180 టి.యం.సి.ల వాడకం ఏదైతే కృష్ణా డెల్టాలో జరుగుతూ ఉందో దాంట్లో 100 టి.యం.సిలు ప్రకాశం బ్యారేజీకి దిగువన నదిలో చేరతాయి కాబట్టి వాటిని వేరే ఎవ్వరూ తీసుకోలేరు. కృష్ణా డెల్టా అవసరాలను 180 టి.యం.సిలకు బదులు 100 టి.యం.సిలకే పరిమితం చేసి రెండు కాకపోతే ఒక పంట వేసుకోండి లేదా వరి కాక వేరే ఏదైనా పంట వేసుకోండి అని వాళ్ళకు చెపితే 80 టి.యం.సిల నీళ్ళను ఆదా చెయ్యవచ్చు. దీనితో పాటు మేము అంటున్నది ఇంకొకటి ఏమిటంటే ఈ డిపెండబిలిటీని 75 శాతం నుంచి 60 శాతానికి తగ్గించుకుందాం. అంటే రైతులకు నాలుగింట మూడేళ్ళు కాదు, అయిదింట మూడేళ్ళే నీళ్ళుంటాయి. దానికి ఒప్పుకుంటే నికర జలాలు పెరుగుతాయి. అంటే ప్రాజెక్టు కట్టుకోగల అవకాశముండే నీళ్ళు పెరుగుతాయి. 60 శాతం డిపెండబిలిటీ కింద మరొక 200 టి.యం.సిలు అదనంగా దక్కుతాయి. ఈ 200 టి.యం.సిలు, ఆ 80 టి.యం.సిలు మొత్తం 280 టి.యం.సిలను ఎనిమిది ప్రాజెక్టులకు కూడా ఒక్కొక్క దానికి 35 టి.యం.సిలు కేటాయించవచ్చు. ఒక రెండున్నర లక్షల ఎకరాల వరకు తరి పండించుకునే అవకాశం ఉంటుంది లేదా మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఆరుతడి పండించుకునే అవకాశం ఉంటుంది. మంచి నీటి సరఫరాకు అవకాశం ఉంటుంది. అప్పుడు గోదావరి నీళ్ళు ట్రాన్స్‌ఫర్ చేయాల్సిన అవసరం ఉండదు. పై రాష్ట్రాలకు అప్పగించే అవసరం ఉండదు. కానీ ఇవ్వాళ ఏం జరుగుతుందంటే, ఈ ఎనిమిది ప్రాజెక్టులకు ఏ రకమైనటువంటి హక్కులు అడగమని చెప్పేసి, గోదావరి నుంచి కృష్ణానదిలోకి

నీళ్ళు ట్రాన్స్‌ఫర్ చేసి కృష్ణలో మిగిలే నీళ్ళను ఈ ప్రాజెక్టులకు ఇస్తామంటున్నారు. గోదావరి నీళ్ళు దాదాపు గ్యారంటీగా ట్రాన్స్‌ఫర్ అవుతాయి. కానీ కృష్ణలో పై నుంచి నీళ్ళు వస్తాయనే గ్యారంటీ లేదు. ప్రతి సంవత్సరం వస్తాయనే నమ్మకం లేదు. వాళ్ళు దానిని పైన ఆపుకుంటే అవి కూడా రావు. మరి అప్పుడు ఈ ఎనిమిది ప్రాజెక్టులకు డిపెండబిలిటీ 50 శాతం కాదు, 40 శాతం కాదు, 30 శాతం కూడా ఉండకుండా పోయే అవకాశం ఉంది. అప్పుడవి శాశ్వతంగా మిగులు జలాల ప్రాజెక్టులుగా ఉండిపోతాయి.

## పులిచింతల

పులిచింతల గురించి మీ అభ్యంతరమేమిటి అని చాలామంది అడుగుతుంటారు. ఇంతకు ముందు చెప్పాను కాలువలను ఆధునీకరించి, రివర్స్‌ఫ్లోని కూడా కలుపుకొని 48 టి.యం.సిలను ఆదా చేసి మూడు ప్రాంతాలకు పంచుకున్నాము అన్నాను. అందులో 19 టి.యం.సిలు రాయలసీమకు, 20 టి.యం.సిలు తెలంగాణకు, 9 టి.యం.సిలు పులిచింతల ద్వారా ఆంధ్రా ప్రాంతానికి అని చెప్పాను. దేనికోసం కట్టుకుంటున్నారు పులిచింతలను అనంటే చాలా ముందుచూపుతో అని చెప్పాల్సి ఉంటుంది. కర్ణాటక ఎప్పటికైనా పైన ప్రాజెక్టులు కట్టుకుంటే సకాలంలో కిందికి నీళ్ళు రాకపోవచ్చు కాబట్టి ఆ ప్రమాదాన్ని శంకించి ఈ ఏర్పాటు చేసుకుంటున్నారు. బచావత్ అవార్డులో మనమే ఒప్పుకున్నటువంటి పాయింట్ ఏమిటీ అనంటే ఆయన రెండు స్కీములు పెట్టి మూడు రాష్ట్రాలనూ అడిగారు మీకు ఏది కావాలి అని. వచ్చే నీళ్ళు ఎట్లా పంచుకుంటారనే దానికి సంబంధించినవే ఆ రెండు స్కీములు కూడా. ఒక పద్ధతేమో ప్రోరాటా. అంటే వచ్చిన నీళ్లు వచ్చినట్టుగా ఆయా ప్రాజెక్టుల సామర్థ్యం దామాషాలో తీసుకోవడం. దీని ప్రకారం ప్రతి డ్యాంలోనూ కొంత ఉంచుకొని మిగతాది కిందికి పంపించి వేయాలి, తర్వాతి వాళ్ళు కూడా అలాగే ఉంచుకొని కిందికి పంపించి వెయ్యాలి. అది మొదటి స్కీము. రెండవ స్కీము ఏమిటీ అనంటే పై వాళ్ళు తమకు ఎంత కేటాయించబడిందో అంత ఆపేసుకున్న తరువాతే కింది వాళ్ళకు వస్తుంది. ఈ రెండిట్లో ఏది కావాలని అడిగారు. మామూలుగా మనం ఏమనుకుంటాం? మొదటి స్కీమే కోరుకుంటే మనం కింద ఉన్నాం కాబట్టి ఎప్పటికప్పుడు వచ్చినవి తీసుకుంటే కొంతయినా వస్తుంది అని కదా. కానీ మన వాళ్ళు తెలివిగా ఆలోచిస్తున్నామని రెండోది కోరారు.

నిజానికి మొదటిది కోరుకుని ఉంటే వర్షాలు ఎంత పడ్డాయనే దానితో నిమిత్తం లేకుండా అందరూ దామాషా ప్రకారం నికర జలాలను పంచుకోవచ్చు. అలాగే

మిగులు జలాలు కూడా అందరూ సమానంగా వాడుకోవచ్చు. అట్లా గాకుండా బచావత్ గారు ఏమన్నారంటే మీరందరూ రెండవ స్కీముకు గానీ ఒప్పుకుంటే– అంటే పై వాళ్ళు తమ కెపాసిటీ మేరకు నీళ్ళను నింపుకున్న తరువాతే కిందికి పంపే పద్ధతికి ఒప్పుకుంటే – వర్షాభావ సంవత్సరాలలో కింద ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కాబట్టి అప్పుడు మిగులు జలాలు మొత్తం ఆంధ్రప్రదేశ్ వాడుకుంటుంది అని నేను అవార్డు రాస్తానని అన్నాడు. అయితే ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చు కానీ ప్రాజెక్టులు కట్టుకోవడానికి మాత్రం వీలు లేదు. మన వాళ్ళు ఏం చేశారంటే అప్పటికి పైన ఎక్కువ ప్రాజెక్టులు లేవు. పై వాళ్ళు ఎంత నిలుపుకున్నా మిగులుతాయి కాబట్టి రెండోది ఒప్పుకుంటే మనకు నికర జలాలూ వస్తాయి, మిగులు జలాలూ వస్తాయి అనుకొన్నారు. కష్టం ఎప్పుడొచ్చిందంటే పై వాళ్ళు మేలుకున్న తరువాత. వాళ్ళు లేటుగా ఎందుకు మేలుకున్నారు? ఇక్కడ ప్రాంతీయ వివక్ష ఉన్నట్టే అక్కడా ప్రాంతీయ వివక్ష ఉంది. కృష్ణానది కర్ణాటకలో ప్రవహించే ప్రాంతమంతా వెనకబడిన ప్రాంతమే. పాత బొంబాయి రాష్ట్రం, పాత హైద్రాబాద్ సంస్థానంలోని ప్రాంతాలవి. వాటిని వాళ్ళు పట్టించుకోలేదు. వాళ్ళకు బెంగుళూరు, మైసూరే కర్ణాటక అంటే– మనకు ఆంధ్రప్రదేశ్ అంటే కొన్ని ప్రాంతాలు మాత్రమే అయినట్లు.

వాళ్ళు మేలుకునేటప్పటికి ఆంధ్రా వాళ్ళకు అర్థం అయ్యింది – వాళ్ళు డ్యాములు కట్టుకోవడం మొదలుపెడితే అవి నిండేదాకా కిందికి పంపియ్యరు అని. దాంతో ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కావాలి పులిచింతల దగ్గర అనుకొన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అంటే దానికి ఎక్స్ట్రా కేటాయింపు ఏమీ ఉండదు. ముందు సంవత్సరం లేటుగా వచ్చిన నీళ్ళు దాంట్లో ఉంటాయి. రెండో సంవత్సరం పై నుంచి నీళ్ళు రాకపోతే దాన్ని వాడుకుంటారు. అందుకోసం ఉద్దేశించిందే పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్. మరి దానికి 9 టి.యం.సిల కేటాయింపు ఎందుకు అన్నది తెలంగాణ వాళ్ళు, రాయలసీమ వాళ్ళు వేస్తున్న ప్రశ్న. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అంటేనే దానికి కేటాయింపు ఉండదు. ఉన్న కేటాయింపులోనే ముందు సంవత్సరం లేటుగా వచ్చిన నీళ్ళు వాడుకోనివి పైన ఉండిపోతాయి. ఆల్మట్టి రావడం వల్ల, నారాయణపూర్ రావడం వల్ల తరువాతి సంవత్సరం నీళ్ళు రావడం లేటయితే ఈలోగా ఈ నీళ్ళు వాడుకోవచ్చు. అటువంటప్పుడు దానికి కేటాయింపు ఎందుకు? కాబట్టి ఆ 9 టి.యం.సిలు నాగార్జునసాగర్‌లోనే ఆపుకుంటే తెలుగుదేశం పార్టీ హయాంలో మొదలుపెట్టిన ఎలిమినేటి మాధవరెడ్డి కాలువకు నీళ్ళివ్వొచ్చు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు ఆ నీళ్ళు అందుబాటులోకి వస్తాయి. అది భయంకరమైన వ్యాధి కాబట్టి ఆ 9 టి.యం.సిలను అక్కడ కేటాయించండి అన్నది తెలంగాణ వాళ్ళ విన్నపం.

కృష్ణా, గుంటూరు జిల్లాల వాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. మాకు దాని పట్ల సీరియస్ అభ్యంతరం ఉంది. అక్కడున్నటువంటి మా బోటి సంఘాలను, ప్రజాతంత్ర సంఘాల వాళ్ళను నేనేమీ అనడం లేదు గానీ ఆ రెండు జిల్లాలలోని రాజకీయ శక్తులు, ప్రజలు నల్గొండ జిల్లాకు నీళ్ళు ఇవ్వడాన్ని గట్టిగా వ్యతిరేకించారు. 9 టి.యం.సిల నీటి కేటాయింపు లేకపోయినా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను శుభ్రంగా కట్టుకోవచ్చు. ఎవ్వరూ కాదనడం లేదు. పులిచింతల కట్టవద్దని ఎవ్వరూ అనలేదు. దానికి కేటాయింపు అక్కర లేదు అని మాత్రమే అంటున్నాం. కృష్ణా డెల్టాకు వచ్చే 180 టి.యం.సిల కేటాయింపులోనే మీరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టుకోండి. ముందు సంవత్సరం వచ్చిన మిగులు జలాలు అక్కడ ఉంటాయి. ఈ సంవత్సరం ఆల్మట్టి వలన, నారాయణపూర్ వలన త్వరగా నీళ్ళు రాకపోతే మీరు ఆ నీళ్ళు వాడుకోండి. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాన్సెప్టే అది కదా. లేదు లేదు ఆ 9 టి.యం.సిలు కావాల్సిందే అన్నారు వాళ్ళు. నల్గొండ జిల్లాలో మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాలు భయంకరమైన ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలు, మీరు చాలా సార్లు టి.వి.లో చూసే ఉంటారు. వాళ్ళకు కృష్ణా జలాలు వస్తే ప్రజల ఆరోగ్యాలు బాగుపడతాయి. రెండవ పంట, మూడవ పంట సమస్య కాదిక్కడ. దానికి కూడా ఒప్పుకోకపోవడం అనేది పులిచింతల విషయంలో అభ్యంతరం. నాకు తెలిసి తెలంగాణ రాష్ట్ర సమితి కూడా దీన్ని గట్టిగా వ్యతిరేకించడం లేదు. మొట్టమొదట ఆ పార్టీ ఎన్నికలలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీతో పాటు అధికారానికి వచ్చినప్పుడు కూడా ఆ పార్టీ ఉపాధ్యక్షుడుగా ఉన్న ఒక వ్యక్తి, నేను పేరు చెప్పను, మాతో ఓపెన్‌గా అన్నాడు మేము వ్యతిరేకించము అని. తెలంగాణ హక్కుల విషయంలో టీఆర్ఎస్ ఎంత పట్టుదలతో ఉంది అనే దానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ. మేము వ్యతిరేకించము, మాకు సాధ్యం కాదు అని ఆనాడే ఆయన  అన్నాడు. కొట్లాడటం వారికి ఇష్టం లేదు.

## పోతిరెడ్డిపాడు

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి ఇంతకు ముందే చెప్పాను. పోతిరెడ్డిపాడు అసలు పేరు పోతులపాడు. శ్రీశైలం నుంచి కుడి పక్కకు నీళ్ళు తీసుకునే కాలువకున్న రెగ్యులేటర్ అది. ఆ కాలువ ఎన్నిటికి అనుకుంటున్నారు? తెలుగుగంగ నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి, ఎస్.ఆర్.బి.సి. నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి. గండికోట లేక గాలేరు– నగరికి కూడా నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి. హంద్రీ– నీవా నీళ్ళు మాత్రం దాంట్లో నుంచి పోవు. శ్రీశైలం డ్యాంలో వేరే పాయింట్ దగ్గర దానికి టేకాఫ్ పాయింట్ ఉంటుంది. అదే కృష్ణానది మీద కొంచెం పైన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది

మహబూబ్‌నగర్ జిల్లాలో. ఇంకా పైన నెట్టెంపాడు పథకం ఉంది. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు నీళ్ళు తీసికెళ్ళే వెలిగొండ ప్రాజెక్టు టేకాఫ్ పాయింట్ వేరే చోట ఉంది.

ఎందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారు అని మేము కోర్టులో ఛాలెంజ్ చేశాము. అప్పుడు ఆ జీవో చూశాము, ఆర్గ్యుమెంట్స్ కూడా రాశాము. కోర్టులో పెండింగ్‌లో ఉంది ఆ కేసు. ప్రభుత్వం ఏం చెపుతుందంటే కృష్ణానదిలో మిగులు జలాలు ఇదివరకు తీరికగా వంద రోజుల్లో వచ్చేవి, ఇప్పుడు ముప్పై రోజులలో మొత్తం వచ్చేస్తున్నాయట. అప్పుడు త్వరగా తీసుకోవాలి కదా ఆ నీళ్ళన్నీ, లేకపోతే సముద్రంలోకి పోతాయి.కాబట్టే రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మేము పెంచుకోక తప్పదు అనే వాదనతో గండికోట లేక గాలేరు– నగరి ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు వాటికి మాత్రమే ఉపయోగపడే ఈ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని రాజశేఖరరెడ్డి పెంచాడు. సహజంగా అడిగే ప్రశ్న ఏంటంటే అదే కృష్ణానది మిగులు జలాలపైన హంద్రీ– నీవా ఉంది, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది, నెట్టెంపాడు ఉంది, వెలిగొండ ఉంది, మరి వాటికీ సమస్యే కదా? అవి కూడా తొందరగా తీసుకోవాలి కదా. వాటికోసం ఎందుకు ఏం చెయ్యవు నువ్వు? వంద రోజుల్లో వచ్చేవి 30 రోజుల్లో వచ్చేస్తున్నాయని ఎవరు కనిపెట్టారో తెలియదు కాని జీవోలో  రాసి ఉంది అది. ఎవ్వరు చెప్పారో నాకర్థం కాలేదు. త్వరగా వచ్చేస్తున్నప్పుడు త్వరగా తీసేసుకోవడం కోసం నేను దీనిని వెడల్పు చేసుకుంటున్నాను అని నువ్వు అంటే రెండు ప్రాజెక్టులను మాత్రమే ఎలా దృష్టిలో పెట్టుకుంటావు? తెలుగుగంగ, గండికోట కాక మిగిలిన ఆరింటి సంగతేమిటి? ఆ రెండు నీ జిల్లావి (కడప) కాబట్టి వాటికొక న్యాయమా? నిజానికి ఆ నీళ్ళు హంద్రీ– నీవా టేకాఫ్‌ను దాటి వస్తాయి, వెలిగొండ టేకాఫ్‌ను దాటి వస్తాయి. కాని వాళ్ళు త్వరగా తీసుకోవడానికి మార్గం లేదు. తన జిల్లాకు నీళ్ళు తీసుకుపోయే తూము పెద్దదిగా చేసుకున్నాడు కాబట్టి తను తీసుకోగలడు. అదీ మా అభ్యంతరం. దీని మీద తెలంగాణ ఉద్యమం ఏమంటుందో తరువాత చెబుతాను.

ఎనిమిది మిగులు జలాల ప్రాజెక్టులను ఇప్పటికే అన్ని రకాలుగా అన్యాయం చేశారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు పోయి వాటికి నీటి హక్కులు అడగము అని చెప్పి వచ్చారు. అంటే మరో నలభై ఏళ్ళపాటు ఆ ప్రాజెక్టులకు నీళ్ళను మనం హక్కుగా అడగటానికి వీలు లేదు. రెండవది, గోదావరి నుంచి నీళ్ళను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను కదా అంటున్నాడు. ట్రాన్స్‌ఫర్ చేస్తే కిందికి వస్తుంది, పైకి రాదు. అవి కిందకి వచ్చి కృష్ణా డెల్టాకు గ్యారంటీ కల్పిస్తాయి. ఆ 180 టి.యం.సిలు నాగార్జునసాగర్, ఆ

పైన ఆపుకుంటానంటే వర్షాభావ సంవత్సరాలలో 80 టి.యం.సిలను కర్ణాటక వాడు పైన ఆపుకుంటాడు. అది కరెక్టుగా మళ్ళీ వర్షాభావ ప్రాంతానికే ఎఫెక్ట్. ప్రతి సంవత్సరం అలా జరుగుతుందని నేనేమీ అనడం లేదు. వర్షాభావ సంవత్సరాలలో , ఈ సంవత్సరం లాంటి సంవత్సరాలలో అది ప్రభావం వేయగలదు. ఆ ఎనిమిదిటినీ సమానంగా చూస్తున్నావా నువ్వు? కడప జిల్లాకు నీళ్ళిచ్చేటువంటి తెలుగుగంగ, గండికోట ప్రాజెక్టులకు మాత్రమే ఎక్స్‌ట్రా ఏర్పాటు చేసుకుంటున్నావు, వేరే ఎవ్వరికీ ఏర్పాటు చేయకుండా. అందుకే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను అన్యాయమైనటువంటిదిగా మానవ హక్కుల వేదిక భావిస్తుంది.

పోలవరం గురించి ఇందాకే చెప్పాను. తెలంగాణకు ఇంకా మిగిలి ఉన్నటువంటి 680 టి.యం.సిలలో 335 టి.యం.సిలను తీసుకునే ప్రాజెక్టు. కాని ఒక్క చుక్క నీరు తెలంగాణకు ఇవ్వదు. సహజంగానే కోపం వస్తుంది తెలంగాణ వాళ్ళకు. అంతే గాకుండా 9 ఆదివాసీ మండలాలలోని – దాంట్లో 7 ఖమ్మం జిల్లాలో ఉన్నాయి – 276 గ్రామాలను పూర్తిగా ముంచేస్తున్నావు. అక్కడ బతికే వాళ్ళు ముఖ్యంగా కోయలు, కొండరెడ్లు. బాగా వెనుకబడిన తెగలు. వాళ్ళు బయటకు పోయి బతకలేరు. వాళ్ళకు నామ్‌కే వాస్తే భద్రాచలం దగ్గర ఇళ్ళు కట్టిస్తామని చెప్పారు గానీ, భద్రాచలం దగ్గర వాళ్ళు బ్రతకడం సాధ్యం కాదు. ఉపాధి చాలా సమస్య అవుతుంది. పోలవరం పట్ల మా అభ్యంతరం అదీ.

## బాబ్లీ

ఇక బాబ్లీ విషయానికొస్తే చిన్న ప్రాజెక్టు అది. అంటే మైనర్ ప్రాజెక్టు. ఒక పెద్ద సైజు చెరువు లాంటిది. మహారాష్ట్ర వాళ్ళు దానికి ఎంచుకున్న చోటు శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ లోపల ఉంది. డ్యాంకు రిజర్వాయర్ ఉంటుంది కదా, ఆ బ్యాక్ వాటర్ లోపల ఉండే చోటును ఎంచుకుని కడుతున్నారు వాళ్ళు. కాబట్టి పై నుంచి వచ్చే నీళ్ళే కాకుండా ఈ బ్యాక్ వాటర్ నీళ్ళంతా కూడా వాళ్ళు తీసుకుపోతారు. 2 టి.యం.సిల కోసం కట్టిన ప్రాజెక్టు అది. ఎంత తీసుకుపోయినా తెలంగాణ ఎడారి అయిపోతుందనేది ఎంత వాస్తవమో నాకు అర్థం కావడం లేదు. మేము మానవ హక్కుల వేదికగా దీని మీద ఒక వైఖరి ఏమీ తీసుకోలేదు. ఒక రోజు పోయి, చూసి, ఆ ఇంజనీర్లతో మాట్లాడదాము అనుకున్నాము. ఎందుకంటే మన దగ్గర ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ అని కొట్లాడుకుంటాం కాని వేరే రాష్ట్రాల దగ్గరకి వచ్చే సరికి మనమంతా 'మంచివాళ్ళం', వాళ్ళంతా 'చెడ్డవాళ్ళు'. తెలుగుజాతే గొప్పజాతి. నదుల విషయంలో వేరే జాతుల వాళ్ళందరూ దుర్మార్గులు అని ముఖ్యంగా మీడియా

భయంకరమైన ప్రచారం చేస్తుంది. కాబట్టి కేవలం 2 టి.యం.సిల కోసం కట్టిన ప్రాజెక్టు, ఒక వేళ శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో కట్టినా కూడా ఎంత తీసుకోగలరు వాళ్ళు? 10 టి.యం.సిలో, 15 టి.యం.సిలో.

శ్రీరాంసాగర్ 10 లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చేటువంటి ప్రాజెక్టు. తెలంగాణ ఎడారి అయిపోతుంది అనే వ్యాఖ్య ఎంతవరకు వాస్తవమో తెలియదు కాబట్టి, మేము చూసి వచ్చాక మహారాష్ట్ర ఇంజనీర్లతో మాట్లాడాక ఒక అంచనాకు రాగలుగుతాం అనుకున్నాం.

## లిఫ్టులు ఆచరణ సాధ్యమా!

ఆఖరున ఒక విషయం చెప్పి ముగిస్తాను. తెలంగాణకు ఇంకొక సమస్య ఏమిటంటే గోదావరి బేసిన్‌లో ఇంకా 245 టి.యం.సిలు ఉన్నాయని చెప్పాను కదా. తక్కువేమీ కాదు అవి. కానీ గోదావరి బేసిన్‌లో సమస్య ఏమిటంటే నదీ ప్రవాహం ఎత్తు బాగా తక్కువ, నీళ్ళు కావాల్సిన భూమి ఎత్తు చాలా ఎక్కువ. సముద్ర మట్టం నుంచి గోదావరి ప్రవాహం సుమారుగా 75-80 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అక్కడి నుంచి నీళ్ళు ఎక్కడికి ఇవ్వాలి? వరంగల్‌కు కానీ, కరీంనగర్‌కు కానీ ఇచ్చుకుంటూ రావాలి. వేగంగా పెరుగుతుంది నేల ఎత్తు. అంటే గోదావరి జలాలు ఉత్తర తెలంగాణకు ఇవ్వాలంటే లిఫ్టు తప్ప వేరే మార్గం లేకపోవడమే సమస్య. లిఫ్టు ఇరిగేషన్ అనేక రకాలుగా సమస్యాత్మకం. ఇప్పుడు దేవాదుల కడుతున్నారు. 14 లిఫ్టులు దానికి. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 50 టి.యం.సిలు ఇస్తామంటున్నారు. డ్రిప్ ఇరిగేషన్ కింద ఒక టి.యం.సిని 22 వేల ఎకరాలకు ఇవ్వడం ద్వారా విపరీతంగా నీళ్ళు ఇస్తాము వరంగల్ జిల్లాకు అంటున్నారు కానీ 14 లిఫ్టులతో డిజైన్ చేసినటువంటి ప్రాజెక్టు దేశంలో ఇప్పటి దాకా లేదు. చిన్న లిఫ్టులు కావవి, బాగా పెద్ద లిఫ్టులు. మన రాష్ట్రంలో వంద ఎకరాలు, రెండు వందల ఎకరాలు, మూడు వందల ఎకరాల కోసం కట్టిన లిఫ్టు ఇరిగేషన్ స్కీములన్నీ మూత పడ్డాయి. నిధులు సరిగ్గా ఇవ్వక, రిపేర్లు జరగక రకరకాల కారణాలతో మొత్తమన్నీ మూత పడ్డాయి. అటువంటిది 50 టి.యం.సిల నీటిని 14 లిఫ్టుల ద్వారా వరంగల్ సిటీకి తాగు నీరు, చుట్టు పక్కల గ్రామాలకు సాగునీరు ఇస్తామన్నది ఎంతవరకు సాధ్యం అన్నది పెద్ద సందేహం. ఖర్చు చెప్పాలంటే ఒక ఎకరానికి 100 మీటర్లు లిఫ్టు చేసి సాగునీరు ఇవ్వాలి అంటే 1000 యూనిట్లు ఖర్చు అవుతుంది కరెంటు. ఇది లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణ వ్యయం కాదు, ఆపరేషన్ ఖర్చు. నిర్మాణ వ్యయం ఎలాగూ కొంత ఉంటుంది. ఎకరానికి 100 మీటర్లు లిఫ్టు చేసి నీళ్ళివ్వాలి అంటే యూనిట్ రెండు రూపాయల లెక్కనేసుకున్నా

1000 యూనిట్లకు రెండువేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఏ రైతైనా ఎకరా సాగునీటికి రెండువేల రూపాయలు కట్టగలడా?

కృష్ణా డెల్టాలో అయినా, గోదావరి డెల్టాలో అయినా నీటి తీరువా ఎంత వసూలు చేస్తారు? 200 రూపాయలు వసూలు చేస్తారు. డెల్టాలో ఏమో నువ్వు కాలువలు తవ్వి రెండువందలకు నీళ్ళిస్తావు, నేనేమో ఎకరాకు రెండువేలు కట్టుకోవాలా అనడా! ప్రాంతీయ వివక్ష మాట అటుంచి అసలు కట్టలేడు రైతు. అంతే కాదు ఇవ్వాళ మన వాళ్ళు ఏం చేస్తున్నారు? విద్యుత్ ఉత్పత్తి మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారు. ఒక్కొక్కళ్ళు అయిదు రూపాయలు యూనిట్, ఆరు రూపాయలు యూనిట్‌కు అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. అంటే రేపు రెండు వేల రూపాయలకు కూడా ఒక ఎకరాకు సాగునీరు రాదు. మూడువేలు కావచ్చు, నాలుగు వేలు కావచ్చు, అయిదు వేలు కూడా కావచ్చు. అసాధ్యం. అప్పుడు ఏమి చెయ్యాలి? గవర్నమెంట్ పెట్టుకోవాలి. మేము ఒక లెక్క తీశాము. ఇవ్వాళ కడుతున్న అన్ని ప్రాజెక్టులు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. గోదావరి నీళ్ళ మీద అయినా, కృష్ణా జలాల మీద అయినా రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరు మీద కడుతున్నవి అన్నీ కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. వీటన్నిటి కరెంటు ఖర్చు ప్రభుత్వం పెట్టుకోక తప్పదు. ఎందుకంటే రైతులు మహా అయితే 5 శాతం పెట్టుకోగలరంతే. ప్రభుత్వానికి ఎంత ఖర్చు అవుతుందంటే రాష్ట్రంలో ఇవ్వాళ అన్ని వ్యవసాయ బోరు బావులకు ప్రభుత్వం పెట్టుకుంటున్న దానికి సమానం అవుతుంది. అంటే బిల్లు రెండు రెట్లు అవుతుంది. వ్యవసాయ బావులకు ఇస్తున్న కరెంట్‌కే చెల్లించలేమని రోశయ్య గారు ఏడుస్తున్నారు. కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యేటప్పటికి ఆ బిల్లు రెట్టింపు అవుతుంది. అది జరిగే పనేనా! ఏదో ఒక రోజు ఒక ప్రభుత్వం వచ్చి నావల్ల కాదూ అంటే ఏమవుతాయి ఈ ప్రాజెక్టులు. సెజ్‌లకు భూములిచ్చి, ఇదమ్మి, అదమ్మి వచ్చిన డబ్బులంతా ఇప్పుడు రైతులకు ఉచిత కరెంటుకు ఇస్తున్నాడు. రేపు ఏం చేస్తాడు? ఎకరాకు వెయ్యి యూనిట్ల విద్యుత్ కొని ఏ రైతూ వ్యవసాయం చేయలేడు, సాధ్యం కాదు.

## ప్రాణహిత – చేవెళ్ళ

ఇంకొక పెద్ద భూతం ఉంది, ప్రాణహిత – చేవెళ్ళ అని. దానికి 16 లిఫ్టులు. 750 కిలో మీటర్లు పోతుందది. ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడి హేటి దగ్గర మొదలుపెట్టి హైద్రాబాద్ దగ్గర చేవెళ్ళ వరకు వస్తుందది. ఆ ఊరి రాజకీయ ప్రాముఖ్యం మీ అందరికి తెలుసు. సబితా ఇంద్రారెడ్డి ఊరు. ఆ గ్రామం దాకా పోయి అక్కడ నీళ్ళివ్వాలి. దారి అంతా ఇచ్చుకుంటూ పోతుంది 160 టి.యం.సిల నీళ్ళు 16

లక్షల ఎకరాలకు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి ఇన్ని జిల్లాలకు. ఆ ఒక్క ప్రాజెక్టు రోజువారీ అవసరాల కోసమే ఒక అల్ట్రా మెగావాట్ థర్మల్ ప్లాంట్ కావాలి. మేము లెక్క వేసే చెపుతున్నాము ఈ మాటలు, ఊరికే మాట్లాడటం లేదు. 5000 మెగావాట్లు ఉత్పత్తి చేసే ఒక అల్ట్రా మెగావాట్ ప్లాంట్ ఈ ఒక్క ప్రాజెక్టు అవసరాల కోసమే కావాలి. కడతావా? ఎక్కడ కడతావు? అది ప్రైవేటు సెక్టార్‌కు ఇస్తే వాళ్లు రేపు ధర పెంచితే ఏమవుతుంది? ఎంత ఖర్చు పెట్టుకోగలుగుతావు? విచిత్రమేమిటంటే ఇంత దూరం పోయి 16 లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చే ఈ ప్రాజెక్టు దాని టేకాఫ్ పాయింట్ దగ్గర 35 కిలోమీటర్ల వరకు ఒక్క చుక్క నీరు ఇవ్వదు. మళ్ళీ అది ఆదిలాబాద్ జిల్లాలో బాగా వెనుకబడిన ప్రాంతం కూడా. అక్కడి జనాలు ఇవ్వాళ ఆందోళన చేస్తున్నారు ముందు మాకు నీళ్ళు ఇచ్చి తర్వాత మీరు తీసుకుపోండని. మేము కూడా వాళ్ళతో పాటు ఆందోళన చేస్తున్నాము. అక్కడెక్కడో చేవెళ్ళ పోవటానికి 16 లిఫ్టులు కట్టగలిగిన వాడివి ఒక లిఫ్ట్ ద్వారా మాకు నీళ్ళు ఎందుకు ఇవ్వవు అని అంటున్నారు వాళ్ళు. అదొక అంశం.

## ఒక ప్రత్యామ్నాయం

ఇవన్నీ ఎందుకు చెపుతున్నానంటే గోదావరి జలాలు తెలంగాణకు ఇవ్వడం అనేది నీళ్ళున్నాయి తీసుకోవచ్చు అనేంత సులభమైన విషయం కాదు. చాలా మంది చేస్తున్న ఒక సీరియస్ చర్చ ఏమిటంటే క్యాచ్‌మెంట్‌లో నుంచి నీళ్ళంతా నదిలోకి పోనిచ్చి మళ్ళా లిఫ్టు చేసి వెనక్కు తీసుకొచ్చే బదులు క్యాచ్‌మెంట్‌లోనే ఎక్కడికక్కడ దానిని ఆపుకొనేటటువంటి ఇరిగేషన్ సిస్టం ఉండాలని. ఇది అసాధ్యమేమీ కాదు. తెలంగాణలో చెరువులు బాగా ఉన్నాయి, రాయలసీమలో కూడా. పై నుంచి వచ్చే నీళ్ళను ఎట్లాగూ లిఫ్టు ద్వారా తీసుకోక తప్పదు కానీ, కనీసం మన క్యాచ్‌మెంట్‌లో ఉన్న నీళ్లనయినా మనం ఆ రకంగా వాడుకుంటే బాగుంటుంది. ఉత్తర తెలంగాణలో వర్షపాతం బాగానే ఉంటుంది. వరంగల్ జిల్లాను ఉదాహరణగా తీసుకుంటే దక్షిణాన ఉన్న జనగామ ప్రాంతంలో మహబూబ్‌నగర్‌లో లాగా, కర్నూలు, అనంతపురంలలో లాగా 500 మి.మీ వర్షపాతం మాత్రమే పడినా, ఏటూరు నాగారంలో 1100 మి.మీ దాకా వర్షం పడుతుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో పడుతున్న వర్షపాతంతో సమానమది. ఆ వర్షాన్నంతా నదిలోకి పోనిచ్చి మళ్ళీ దానిని లిఫ్ట్ చేసి వెనకకు తీసుకోవడం ఎందుకు? ఎక్కడికక్కడ నీళ్ళను ఆపుకునేటువంటి చెరువుల వ్యవస్థను తయారు చేసుకునే మార్గం లేదా? ఇప్పుడు కూడా ఉన్నాయి కదా చెరువులు అంటారేమో. అవి చాలవు. ఎందుకంటే అదే టైములో వర్షం వల్ల అవీ నిండి

ఉంటాయి. కాబట్టి కొత్త చెరువులు తవ్వాల్సి వస్తుంది. ఉన్న వాటిని విస్తరించాల్సి వస్తుంది. అటువంటి వ్యవస్థ గురించి సీరియస్‌గా ఆలోచించకపోతే ఇది మనకు తలకు మించిన భారం అవుతుంది. ఆచరణ యోగ్యమైన పద్ధతి కాదు. కానీ ఆ సిస్టం వలన కాంట్రాక్టర్లకు పైసలు రావు. చిన్న చిన్న చెరువులు, కట్టలు కడితే వాళ్ళకు లాభాలు ఏమొస్తాయి?

రెండవది ఇవ్వాళ నేను ముఖ్యమంత్రి అయ్యాను కాబట్టి వచ్చే సంవత్సరానికల్లా 16 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇచ్చేయాలి అనుకోవడం సబబు కాదు. నెమ్మదిగా జాగ్రత్తగా చేయాల్సిన పనులు అవి. మనకున్న రాజకీయ సంస్కృతి, మనకున్న రాజకీయార్థిక సంస్కృతి అటువంటి ఆలోచనలను అమలు చెయ్యదు. కానీ ఇవ్వాళ చాలా సీరియస్‌గా తెలంగాణలో జరుగుతున్న చర్చ మాత్రం గోదావరి జలాలను తెలంగాణకు ఉపయోగించాలంటే ఇది పద్ధతి కాదనే. పైనుంచి వచ్చే నీళ్ళను ఎట్లాగూ లిఫ్ట్ చెయ్యక తప్పదు, ఆ ఖర్చు భరిస్తాము కానీ మన క్యాచ్‌మెంట్ నీళ్ళయినా మనం ఈ రకంగా వాడుకుందామని వాళ్ళ ఆలోచన. దానికి కూడా అవకాశం లేనటువంటి వాతావరణం, పరిస్థితి ఉంది.

ఇవీ మొత్తంగా నేను మీకు చెప్పాలనుకున్న విషయాలు. మీరు ప్రశ్నలేమన్నా అడిగితే నాకు తెలిసిన మేరకు నేను జవాబు చెప్పే ప్రయత్నం చేస్తాను.

## ప్రశ్నలు – జవాబులు

ప్రశ్న : తెలంగాణలో కిందికి వస్తే గదా గోదావరి ఎత్తు తక్కువ ఉండేది, పైన గోదావరి మీద ప్రాజెక్టులు కట్టలేమా?

జవాబు: గోదావరిలోకి ఎక్కువ నీళ్ళు వచ్చేది ప్రాణహిత నుంచి, ఇంద్రావతి నుంచి, శబరి నుంచి కాబట్టి ప్రాణహిత దగ్గరకు వచ్చే లోపల గోదావరిలో ఉన్న నీళ్ళను ఎలాగూ వాడుకుంటున్నాం. శ్రీరాంసాగర్ దగ్గర ఎత్తు సుమారుగా ఉంది. దాన్ని ఇంతకుముందే కట్టేసుకున్నాం. అక్కడి నుండి తగ్గుతుంది ఎత్తు. మళ్ళీ నీళ్ళు ఎక్కడి నుంచి వస్తాయి మనకు? ప్రాణహిత దగ్గర. అక్కడ మరో ప్రాజెక్టు కట్టేసుకుంటున్నాము. ప్రాణహిత నది గోదావరిలో కలిసేది కాళేశ్వరం దగ్గర. అది ఒక పుణ్య క్షేత్రం. అక్కడ కాకుండా పైనే కట్టేసుకుంటున్నాం ప్రాజెక్టు. ఇంద్రావతి వచ్చి గోదావరిలో కలిసిన తరువాతనే ఇచ్చంపల్లి డ్యాం కట్టాలనే డిమాండు చాలా కాలంగా ఉంది. దాంట్లో అనేక సమస్యలున్నాయని చెప్పి దాని పక్కనే దేవాదుల దగ్గర

కడుతున్నారు.కాబట్టి నీకు నీళ్ళు అందుబాటులోకి వచ్చేటప్పటికే ఎత్తు తగ్గిపోతోంది. అదీ సమస్య.

ఇంకొక్క విషయం చెబుతాను, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విషయం వచ్చేటప్పటికి మా అభ్యంతరం ఏమిటో నేను చెప్పాను– ఎనిమిది మిగులు జలాల ప్రాజెక్టులను సమానంగా చూడకుండా కడప జిల్లాకు నీళ్ళిచ్చే వాటికి ప్రాముఖ్యం ఇస్తున్నాడని. కానీ తెలంగాణవాదుల అభ్యంతరం ఏమిటి అంటే మిగులు జలాలు అసలు రాయలసీమకే ఇవ్వడానికే వీలు లేదని. కృష్ణానదిలోని మిగులు జలాలు మొత్తం తెలంగాణకే చెందుతాయి, రాయలసీమకు కాదు అని వాళ్ళు అంటున్నారు. అందువల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపుదలను వ్యతిరేకిస్తున్నారు. మేము ఆ వైఖరి తీసుకోవడం లేదు. మొదటే చెప్పాను. నీటి మీద హక్కు అనేది అవసరాన్ని బట్టి ఉండాలి. రాయలసీమకూ నీళ్ళు అవసరమే. ఎటొచ్చీ సమానంగా చూడాలి. అధికారం మాది కాబట్టి మా జిల్లాకు నేను ఎక్కువ ఇచ్చుకుంటాను అనే వైఖరి సరైనది కాదు. టి.ఆర్.ఎస్ అభిప్రాయం ఏమిటంటే – టి.బి డ్యాం వగైరాల ద్వారా రాయలసీమకు ఇప్పటికే కృష్ణా నీళ్ళు ఇవ్వడం జరిగింది. రాయలసీమ పెన్నానది బేసిన్‌లో ఉన్నటువంటి ప్రాంతం. ఏ బేసిన్ వాళ్ళు ఆ బేసిన్ నీళ్ళే తీసుకోవాలి. వేరే బేసిన్ నీళ్ళు వాళ్ళు తీసుకోవడానికి వీలు లేదు. హగరి అనే నది ఒకటి, హంద్రీ అని మరొకటి మాత్రమే – రెండూ చిన్న నదులే– కృష్ణానది ఉపనదులు. ఆ మేరకు మాత్రమే రాయలసీమకు కృష్ణానది మీద హక్కు ఉంటుంది. అదెలాగూ వాళ్ళిప్పుడు సుంకేసుల ప్రాజెక్టు నుంచి తీసుకుంటున్నారు కాబట్టి మిగులు జలాలలో ఇక రాయలసీమకు ఇవ్వడానికి వీలులేదు అనేది తెలంగాణ ఉద్యమకారుల అభిప్రాయం. మా అభిప్రాయం ఇంతకు ముందే చెప్పాను.

బేసిన్‌లో ఉండటం, ఉండకపోవడం అనేది మనం ఎంచుకున్నది కాదు. ప్రకృతిలో మనం పుడతాం. అవసరాన్ని బట్టి నీరు తెచ్చుకోక తప్పదు. ఇప్పుడు రాజస్థాన్‌లో నీళ్ళు లేవు కాబట్టి ఎక్కడ నుంచీ నీళ్ళు ఇవ్వం అంటే రాజస్థాన్ ఏమైపోవాలి? వేరే బేసిన్ నుంచి నీళ్ళు ఇస్తేనే రాజస్థాన్ ఈ మాత్రమైనా బ్రతకగలుగుతోంది. కాబట్టి అది సరైన వైఖరి కాదని

మా అభిప్రాయం. టి.ఆర్.ఎస్ అభిప్రాయం గానీ, చాలామంది తెలంగాణ ఉద్యమకారుల అభిప్రాయం గానీ రాయలసీమకు మిగులు జలాలు ఇవ్వడానికి వీలు లేదు అనే. అందువల్లే వాళ్ళు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు అభ్యంతరం చెప్పారు.

పోతే ఇంతకు ముందే చెప్పినట్లుగా క్యాచ్‌మెంట్‌లోనే గోదావరి జలాలను ఆపుకోవడం అనే దానికి చాలా సీరియస్‌గా వర్క్ చేస్తున్న వాళ్ళు ఉన్నారు. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలోని – ఇప్పుడు దానిని ఎన్.ఐ.టి అంటున్నారు – సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న వాళ్ళు అనేక ప్రతిపాదనలు చేశారు. నిజానికి అవన్నీ స్టడీ చేసి అమలు చేస్తే బాగుంటుంది. వాళ్ళను ఎవ్వరూ చెయ్యమనలేదు కానీ, ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాం, ఈ ప్రాంతానికి మేలు చేయాలనే కమిట్‌మెంట్‌తో ఆ ప్రొఫెసర్లు ఈ పని చేశారు. అందులో ఎక్కువ పని చేసిన వ్యక్తి ఆంధ్రా ఆయన, కృష్ణా జిల్లా ఆయన, పాండురంగారావు గారు. ఆయన చాలా శ్రద్ధగా ఈ సమస్యను అధ్యయనం చేశారు. కాని ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయాల పట్ల ఆసక్తి లేదు. ఎందుకంటే వాళ్ళకెంత సేపూ అయిదు సంవత్సరాలలో ఎంత సంపాదించుకోగలుగుతాం, మన కాంట్రాక్టర్లు ఎంత సంపాయించుకోగలుగుతారు అనే దాని మీదే ఉంటుంది వాళ్ళ ధ్యాస అంతా. రెండవది ముఖ్యమంత్రి గారు ఆదేశిస్తే ఆరునెలల్లో అయిపోవాలి. శ్రద్ధగా చేసే పనులు అట్లా అయిపోవు. అటువంటి దురదృష్టకరమైన వాతావరణంలో జీవిస్తున్నాం.

ప్రశ్న : అమెరికాలో 19వ శతాబ్దంలోనే నీటి పారుదల ప్రాజెక్టుల మీద సమగ్రమైన అధ్యయనాలు చేశారు. వాళ్ళ అనుభవాన్ని మీరేమన్నా పరిగణనలోకి తీసుకున్నారా?

జవాబు : అమెరికాలో కూడా తగాదాలు ఉన్నాయి. కానీ వాళ్ళేమి చేశారంటే నదీ జలాల పంపకానికి ట్రిబ్యునల్‌ను ఒకటి ఏర్పాటు చేసుకుని, పంపకం అయిపోయిన తరువాత దాన్ని ప్రభుత్వ నిర్వహణకు వదిలేయకుండా, ఆ తర్వాత కూడా దానిని పర్యవేక్షించడానికి రివర్ వ్యాలీ అథారిటీని పెట్టుకున్నారు. ఉదాహరణకు మిసిసిపి రివర్ వ్యాలీ అథారిటీ అని ఉంది.

అమెరికాలో మిసిసిపి ఒక పెద్ద నది. అనేక రాష్ట్రాల గుండా పోతుంది. మన కంటే అమెరికాలో ఫెడరల్ వ్యవస్థ ఎక్కువ కాబట్టి రాష్ట్రాలకు విడివిడి హక్కులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి రివర్ వ్యాలీ అథారిటీ ఒకటి పెట్టుకుని, ఆ అథారిటీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటారు. మన దగ్గర టి.బి. డ్యాంకు కూడా ఒక అథారిటీ ఉంది కాని అది అమెరికన్ అథారిటీ లాంటిది కాదు. పైర్ల కాలం వచ్చింది, మాకింత నీళ్ళు కావాలి అని మనవాళ్ళు, అలాగే కర్ణాటక వాళ్ళు తమకు టైమైందని ఇండెంట్‌లు (అభ్యర్థనలు) పంపితే అక్కడ నుంచి నీటిని విడుదల చేస్తారు. అది ఒక అడ్మినిస్ట్రేటివ్  అథారిటీ మాత్రమే. అడిగినప్పుడు నీళ్ళు ఇచ్చే అథారిటీ మాత్రమే. అట్లా కాకుండా వివాదాలను కూడా అప్పటికప్పుడు పరిష్కరించేటటువంటి అధికారమున్న ఒక అథారిటీని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్యనే కాకుండా తెలంగాణ, రాయలసీమల మధ్య కూడా అవసరం. మా అభిప్రాయంలో రెండూ కూడా కరువు ప్రాంతాలే. అయినా రకరకాల కారణాల వల్ల ఈ ప్రాంతాల మధ్య కొట్లాటలు వస్తున్నాయి  కాబట్టి రాష్ట్రం లోపల, రాష్ట్రం బయటా కూడా ముందు ఒక అంగీకారానికి రావాలి. తర్వాత దానిని అమలు చేసే అధికారాలు ఉండే ఒక రివర్ వ్యాలీ అథారిటీని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. అది అమెరికా నుంచే నేర్చుకోనక్కర్లేదు కానీ ఆ అవసరం అయితే తప్పనిసరిగా ఉంది. చేస్తే బాగుంటుందని మా అభిప్రాయం.

ప్రశ్న : కావేరి విషయంలో ఎందుకు ప్రతిసారీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తోంది?

జవాబు: కావేరి విషయంలో ఏమైందంటే కర్ణాటకకు, తమిళనాడుకు మధ్య వివాదం ఎంతకీ తెగడం లేదు. దాంతో ఆ నదీజలాల పంపకంపై వేసిన ట్రిబ్యునల్ అవార్డు (తీర్పు) ఇవ్వలేదు. ఆ కారణంగా ప్రతి సంవత్సరం తమిళనాడువాళ్లు తాత్కాలిక ఆర్డరు ఇవ్వమని ట్రిబ్యునల్‌కు దరఖాస్తు పెట్టుకుంటుంటారు. ట్రిబ్యునల్ ఆర్డరు ఇవ్వడం లేదంటూ ఆ తర్వాత సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు వేస్తున్నారు. చూస్తూ కూర్చుంటే గొడవలయిపోతాయి కాబట్టి 'మీ పరిధిలో ఉందా లేదా అని తర్వాత నిర్ణయిద్దురు కాని ప్రస్తుతానికి

ఆర్డరు అయితే ఇవ్వండి' అని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెపుతూ వస్తోంది.

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలకుండే ప్రపంచ జ్ఞానం చాలా తక్కువ, ముఖ్యంగా ఇటువంటి విషయాలలో. అదే ట్రిబ్యునల్‌లో అయితే జడ్జితో పాటు ఇరిగేషన్ గురించిన జ్ఞానం ఉన్నవాళ్లు సభ్యులుగా ఉంటారు. జడ్జిలకు వదిలేయడం అంత  మంచిది కాదని నా ఉద్దేశ్యం.

ప్రశ్న : జాతీయ నదుల అనుసంధానం గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశంలో భాగంగానే కృష్ణా- గోదావరి నదులను అనుసంధానం చేసి దేశంలోనే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుపరుస్తున్న మొదటి రాష్ట్రంగా ఉండబోతున్నామని చెప్పి పొన్నాల లక్ష్మయ్య గారు ప్రకటిస్తూ ఉంటారు. పోలవరానికి సంబంధించి పుచ్చలపల్లి సుందరయ్య గారే చెప్పారు, విశాలాంధ్రలో సమగ్ర నీటి పంపిణీకి పోలవరం కట్టాలని. ఆయనే చెప్పిన తరువాత పోలవరానికి అభ్యంతరం ఎందుకు అని ఒక ప్రశ్న వస్తూ ఉంటుంది. అలాగే ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌ల అభ్యంతరాలు ఏమిటి?

జవాబు: నేను పొన్నాల లక్ష్మయ్య గారి తెలివితేటలకు భరోసా ఇవ్వను, పుచ్చలపల్లి సుందరయ్య గారి అభిమానినీ కాను. అభిమానిని కాదంటే... అనుచరుడిని కాదని నా ఉద్దేశం. ఆయన గొప్పవాడే. కాదని ఎవరూ అనరు కానీ, నదుల అనుసంధానంలో చాలా సమస్యలున్నాయి. సుప్రీంకోర్టు ప్రధానంగా అంటున్నది ఏమిటంటే గంగానదిలో ప్రవాహం చాలా ఎక్కువ ఉంది. దక్షిణ భారత దేశంలో తక్కువ ఉంది. ఇవన్నీ ఎట్లుంటాయంటే వాళ్ళు ఢిల్లీలో కూర్చొని ముందు ఒక మ్యాప్ పెట్టుకుంటారు. ఎవరో నిపుణుల్ని అడుగుతారు. గంగానదిలో చాలా నీళ్ళున్నాయి, కింద లేవు, పంపించేస్తే బాగుంటుంది కదా అని. అంతకంటే దాని గురించి పెద్ద చర్చలేమీ లేవు. గంగానది నుంచి గోదావరి బేసిన్‌కు నీళ్ళు రావాలంటే రెండు పెద్ద లిఫ్టులు కావాలి. వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు దాటాలి. రెండు సార్లు లిఫ్టు చేసి గోదావరి బేసిన్‌లో పొయ్యాలి. గోదావరిలో కూడా అంత షార్టేజి లేదు, షార్టేజి ఉండేది కృష్ణా బేసిన్, పెన్నా బేసిన్, కావేరి బేసిన్‌లలో. గోదావరి నుంచి  మళ్ళీ కృష్ణా బేసిన్‌లోకి పోవాలంటే హైద్రాబాద్ రిడ్జ్ దాటాలి. అది కూడా 400 మీటర్ల లిఫ్టు. మూడు పెద్ద లిఫ్టులు, మూడు

పెద్ద జంపులు చెయ్యాలి. చివరికి కావేరి దాకా పోయేటప్పటికి ఎంతవుతుంది అనంటే నేను ఇక్కడ వేసిన లెక్క ప్రకారం ఎకరానికి 20 వేల రూపాయలు ఖర్చు అవుతుంది నీళ్ళు ఇవ్వడానికి. ఏమన్నా బుద్ధి ఉన్న ఆలోచనేనా అది?

డబ్బు సంగతి పక్కన బెట్టి, రెండోది గంగ నుంచి నీళ్ళు ఎక్కడ తీసుకోవాలి? పాట్నా నుంచి తీసుకోవచ్చు. కాని పాట్నా నుంచి నీళ్ళు తీసుకురావాలంటే ముందు జార్ఖండ్ దాటాలి, పశ్చిమ ఒరిస్సా దాటాలి, ఛత్తీస్‌గఢ్ దాటాలి. అవన్నీ వెనుకబడ్డ ప్రాంతాలే. సాగునీరు సరిగ్గా లేని ప్రాంతాలే. వాళ్ళ కళ్ళముందు నుంచి నీళ్ళు దక్షిణ భారతానికి పోతుంటే వాళ్ళు ఊరుకుంటారా? తెలంగాణ నీళ్ళు రాయలసీమకు పోతేనే ఊరుకోవడం లేదు, ఆంధ్రావాళ్ళు పైన నీళ్ళు ఆపుకుంటామంటేనే ఊరుకోవడం లేదు. సౌత్ ఇండియాకు నీళ్ళు పోతుంటే జార్ఖండ్ వాళ్ళు ఊరుకుంటారా? ఎంత గొడవ అవుతుంది? అప్పుడు బంగ్లాదేశ్ ఏమంటుంది. గంగానది మన నది మాత్రమే కాదు, అది అంతర్జాతీయ నది. బంగ్లాదేశ్‌కూ దానిలో హక్కుంది. ఇప్పటికే బంగ్లాదేశ్ ఫరక్కా బ్యారేజీ గురించి సీరియస్‌గా అభ్యంతరం చెబుతూ ఉంది. ఫరక్కా బ్యారేజీ కట్టి మా నీళ్ళు తగ్గించారని ఎప్పటి నుంచో అభ్యంతరం చెపుతూ ఉంది. కాబట్టి అనుసంధానం అనేది జరిగేది కాదు. నేను ఇంతకు ముందు అన్నాను సుప్రీంకోర్టు జడ్జీలకు ప్రపంచ జ్ఞానం చాలా తక్కువ అని. వాళ్ళు ఇచ్చిన సూచనను అదేదో పెద్ద ఆదేశంగా భావించి అమలు చెయ్యాలనుకోవడం సరైనది కాదు.

రెండవది సుందరయ్య గారు చెప్పి ఉండవచ్చును, ఎవరైనా చెప్పి ఉండవచ్చును. ఆ రోజు పూర్తి అవగాహన లేక ఆయన అలా అనుండొచ్చు. అయినా ఆయన గురించి మనకు తెలిసిన దాని ప్రకారం ఆయన ఇవ్వాళ ఉండి ఉంటే వ్యతిరేకిస్తాడనే నేను అనుకుంటున్నాను. ఆయన పార్టీ వాళ్ళు ఏమన్నా సరే, బి.వి.రాఘవులు ఏమన్నా సరే ఆయనైతే పోలవరాన్ని వ్యతిరేకించేవాడని నేను అనుకుంటున్నాను.

పోలవరం మన రాష్ట్రంలోని 276 గ్రామాల్నే కాక పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాలలో కూడా విస్తారమైన అడవిని, అనేక ఆదివాసీ గ్రామాలను ముంచుతుంది. నువ్వు డ్యాం కట్టుకుంటున్నావు, మాకేమీ ఇయ్యవు, మరి మేమెందుకు ముంపు భరించాలని సహజంగానే వాళ్ళు అభ్యంతరపెడతారు

కదా. సుప్రీంకోర్టులో కేసు వేశారు. మేము కూడా హైకోర్టులో పోలవరం భూసేకరణకు వ్యతిరేకంగా కేసువేశాం. అయినా సుప్రీంకోర్టు ఏం చెపుతుంది? నష్ట పరిహారం ఇచ్చేసి తీసుకోండి అంటుంది. అంత కంటే ఏముందదు.

ప్రశ్న : ఇన్ని పెద్ద ప్రాజెక్టులు కట్టే కన్నా, ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ప్రాజెక్టు కడితే మంచిది కదా?

జవాబు : ఖర్చు తక్కువే గాకుండా పంపిణీ మరింత ప్రజాస్వామికంగా ఉంటుంది. ఒక చోట పెద్ద డ్యాం కట్టి నీళ్ళంతా అక్కడే ఇచ్చే బదులు 30 చోట్ల కడితే అక్కడక్కడ నీళ్ళు ఇచ్చుకుంటూ వస్తారు కాబట్టి నీటి పంపిణీ మరింత ప్రజాస్వామికంగా, సమానంగా ఉంటుందనేది వాస్తవమే. కాని ఆలోచనలే వేరే రకంగా ఉంటున్నాయి ఇప్పుడు.

ప్రశ్న : కృష్ణా బేసిన్‌లో నీటికి కొరత ఉంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉంది. అలాంటపుడు గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడం తప్పెలా అవుతుంది? తప్పు కాకపోగా అవసరం, అనివార్యం కూడా. ఎక్కువ చిన్న ప్రాజెక్టులను కట్టడం ఆచరణయోగ్యమూ కాదు, ఆర్థికంగా లాభసాటీ కాదు. అలాగే గోదావరి ఎగువ ప్రాంతంలో భూమి చాలా ఎత్తులో ఉంటుంది కాబట్టి నీటిని అన్ని వందల మీటర్లు ఎత్తిపోయడం (లిఫ్ట్) ఆర్థికంగానూ, ఆచరణరీత్యా కూడా సాధ్యం కాని పని. చివరికి అవి నిష్ప్రయోజనంగానే ఉండిపోతాయి కదా.

జవాబు : రెండూ మీరే అన్నారు. చిన్న ప్రాజెక్టులు కట్టడం లాభసాటి కాదంటున్నారు. పెద్ద ప్రాజెక్టులు కట్టడం ఆచరణసాధ్యం కాదంటున్నారు.

లిఫ్ట్ ప్రాజెక్టులు దీర్ఘకాలికంగా ఆచరణసాధ్యం కాని మాట నిజమే. మరి దానికి ప్రత్యామ్నాయం ఏమిటి? క్యాచ్‌మెంట్‌లోనే నీటిని ఎక్కడికక్కడ నిల్వ చేసే చిన్న ప్రాజెక్టులు కట్టాలి. మీరు ఎకనామికల్ (ఆర్థికంగా లాభసాటి కాదనేది) అనే మాటను కేవలం నగదు ఖర్చుగా చూస్తున్నారు. అంటే సివిల్ ఇంజనీరింగ్ కయ్యే ఖర్చును లెక్కపెడుతున్నారు తప్ప సమాజానికి అయ్యే ఖర్చెంతో లెక్క పెట్టడం లేదు. సమాజానికయ్యే ఖర్చంటే దానికి జరిగే కీడు ఎంతో, మేలు ఎంతో ఆ లెక్కలు వేసుకోవడం లేదు.

ఉదాహరణకు ఒక పెద్ద ప్రాజెక్టు కడతాము. పది చిన్న ప్రాజెక్టులు కడతాము. నిర్మాణ వ్యయమే తీసుకుంటే ఒక పెద్ద ప్రాజెక్టు కట్టేదాని కంటే పది చిన్న ప్రాజెక్టులు కట్టడానికి ఎక్కువ ఖర్చే కావొచ్చు. అయితే ఆ పెద్ద ప్రాజెక్టు వల్ల జీవితం కోల్పోయే ప్రజానీకానికి కలిగే నష్టాన్ని కూడా ఖర్చుగా లెక్కిస్తే ఏది ఎక్కువ ఖరీదైనదో తెలుస్తుంది. ఇప్పటిదాకా ఆ ఖర్చును మనం పరిగణనలోకి తీసుకోవడం లేదు.

గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీళ్లను ట్రాన్స్‌ఫర్ చేయడం వలన ఆంధ్రప్రదేశ్ వాటా కొచ్చే నీళ్లలో కొంత కోల్పోతామని ఇంతకు ముందే చెప్పాను. ఎంత ట్రాన్స్‌ఫర్ చేస్తే దాంట్లో సగం పోగొట్టుకుంటాం. ఐదు తెలంగాణ జిల్లాలకు నీళ్లు ఇవ్వాల్సిన సమయంలో వాళ్లకు ఇవ్వకుండా కిందికి తీసుకుపోతానంటే వాళ్లు నష్టపోరా! కేవలం ఇంజనీరింగ్ దృష్టితో ఈ సమస్యను చూడొద్దు. రాజకీయ, సామాజిక దృష్టికోణం నుంచి కూడా చూడండి. ప్రాజెక్టు ఖర్చులో రాజకీయ, సామాజిక వ్యయం కూడా కలపండి. అదీ ముఖ్యమైన అంశమే. అప్పుడే దాని పూర్తి వ్యయం మనకు అంచనాకు వస్తుంది.

ప్రశ్న : పశ్చిమ కనుమల్లో, తూర్పు కనుమల్లో మైనింగ్ గాని జరిగితే ఈ రెండు నదులకు అసలు నీరు వచ్చే పరిస్థితే కనబడటం లేదు. అలాంటప్పుడు ఈ ప్రాజెక్టులు కట్టి ఏం ప్రయోజనం?

జవాబు : అదొక్కటే కాదు. ఇందులో ఇంకా చాలా సమస్యలున్నాయి. మైనింగ్ జరిగితే ఏ దారుల్లో అయితే వర్షంనీరు నదిలోకి వచ్చి చేరుతున్నదో ఆ దారులు చెల్లాచెదురై కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవ్వొచ్చు. అది సీరియస్ ప్రాబ్లమే కాని గోదావరికి సంబంధించి మరో సీరియస్ ప్రాబ్లం కూడా ఉంది. అదేమిటంటే గోదావరి నదీ జలాల మీద ఒప్పందం కుదిరినప్పుడు ఛత్తీస్‌గఢ్ అనే రాష్ట్రం లేదు. Under the Constitution a new State is bound by the agreement of the previous State (రాజ్యాంగం ప్రకారం కొత్త రాష్ట్రం ఏదైనా పాత రాష్ట్రం కుదుర్చుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండాలి) అని ఉన్నప్పటికీ వాళ్లు గాని వివాదం లేవనెత్తితే, పెద్దఎత్తున రాజకీయ ఆందోళన మొదలుపెడితే, ఛత్తీస్‌గఢ్ వెనుకబడిన

ప్రాంతం కాబట్టి, ఎక్కువగా ఆదివాసులు ఉండే ప్రాంతం కాబట్టి, మా అవసరాల్ని పట్టించుకోకుండా మధ్యప్రదేశ్ గోదావరి నీళ్లన్నిట్నీ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చేసిందని ఫిర్యాదు చేస్తే, మా అవసరాలకు ఆ నీళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తే, రాజ్యాంగ వివాదం లేవనెత్తి కోర్టుకు వెళ్తే అప్పుడు మనకు వచ్చిన 1480 టి.యం.సిలలో ఎన్ని మిగులుతాయో అనుమానమే. ఇప్పుడు మనకు మిగులు అనుకున్నదంతా వాళ్లకు ఇచ్చేయాల్సి వస్తే తెలంగాణ కోసం ఏమైనా మిగులుతుందో లేదో సందేహమే. ఇవన్నీ కూడా ఓపెన్ క్వశ్చెన్స్.

ప్రశ్న: గోదావరి మీద పెద్ద డ్యాములు కట్టే అవకాశం అయితే లేదు. మరి టిఆర్ఎస్ వాళ్లు ఏమైనా ప్రత్యామ్నాయాలు చూపించారా?

జవాబు : తెలంగాణకు ప్రతినిధిగా టిఆర్ఎస్‌నే తీసుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణలో చాలామంది ఆలోచనాపరులు ఉన్నారు. మన రాష్ట్రంలో ఉన్న గోదావరి కాచ్‌మెంట్‌లో ఎక్కడికక్కడ నీటిని నిల్వ చేయడం ద్వారా, మరీ ఎక్కువ ఖర్చు కాని పద్ధతిలో కొంత నీటిని లిఫ్ట్ చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా, ఉన్న చెరువుల్ని బాగు చేయడం ద్వారా, కొత్త చెరువుల్ని తవ్వించడం ద్వారా నీటిని ఉపయోగించుకోవడమే వరంగల్‌కైనా, కరీంనగర్‌కైనా మేలనేది వారు చేస్తున్న ఆలోచన.

మానవహక్కుల వేదిక విశాఖపట్నం
జిల్లా సభల సందర్భంగా చెప్పిన క్లాస్
27 జూన్ 2009

ఈ ఉపన్యాసాన్ని balagopal.org లోను, youtube లోను వినవచ్చు